thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 86 | జగిత్యాల | మంగళవారం | 21జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

మహిళా క్రికెటర్లకు తీపి కబురు



11

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం



**దేవరకద్ర డిఆరఎస్ ప్రాజెక్ట్ సత్వరం చేపట్టాలి**
**కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో సీఎం రేవంత్ భేటీ**
**రక్షణ భూములు కేటాయించినందుకు కృతజ్ఞతలు**



**న్యూఢిల్లీ, జూన్ 22:** ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని సిఎం రేంవత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న

మిగతా 2వ పేజీలో..

## హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సానుకూల సంకేతాలు

- ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీలు
- ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రుణ సహాయం కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- మెట్రో ప్రాజెక్టుకు నిధుల సమకూర్పుపై ఆశాజనక స్పందన
- నేడు కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రితో మరో సమావేశం

2



# చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

- ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా
- వర్ధన్నపేట కార్యకర్తల భేటీలో కెటిఆర్ ఘాటు హెచ్చరిక



**వరంగల్, జూన్ 22:** వచ్చే ఐదేళ్లు ఎవ్వరినీ మరచిపోమని, సిఎం చిట్టి నాయుడును అస్సలు వదిలిపెట్టమని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆరఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో..

# వర్షా కాలానికి ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యాచరణ



- రహదారులు, వంతెనల రక్షణకు ఎస్‌ఓపీ విడుదల
- అక్టోబర్ వరకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి
- వరదల సమయంలో వేగవంతమైన స్పందనకు ప్రత్యేక చర్యలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, జూన్ 22:** వర్షాకాలంలో ప్రజలకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా చూడటంతో పాటు వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు వంటి మౌలిక వసతులకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను విడుదల చేసినట్లు

మిగతా 2వ పేజీలో..



3

## కేరళ తరహాలో కళాకారులను ప్రోత్సహించాలి

- మంత్రులు భట్టి, జూపల్లి

# భూమి గురించి అడిగితే ఎస్‌బిఐపై పగబట్టారు

**రాయదుర్గం భూమల వేలంపై హరీష్ రావు ఫైర్**

**మహబూబ్‌నగర్, జూన్ 22:** హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పటి ప్రభుత్వం ఎకరం భూమిచ్చిందని, అయితే.. రేవంత్ రెడ్డి బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని అమ్మేసిండని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అంతేగాకుండా ఇప్పుడు ఎస్‌బిఐ మీద పగప ట్టిండని మండిపడ్డారు. అచ్చంపేట బీఆరఎస్

మిగతా 2వ పేజీలో..





# విద్యుత్ శాఖలో నకిలీ ఉద్యోగులపై క్రిమినల్ కేసులు!

- స్థానిక పోలీస్ స్టేషన్లో నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ
- విద్యార్హత పత్రాలు తప్పని తేలితే శిక్ష తప్పదు
- మున్ముందు కన్వర్షన్ ల పైనే స్క్రీనింగ్

**తెలంగాణ బ్యూరో:** సంగారెడ్డి జిల్లాలో నకిలీ సర్టిఫికెట్ల తో విద్యుత్ శాఖలో ఉద్యోగాన్ని పొందిన నలుగురు ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ల లలో కేసు నమోదు చేయాలనీ సంగారెడ్డి సర్కిల్ విద్యుత్

మిగతా 2వ పేజీలో..





## డ్రగ్స్ కు దూరంగా వుంటేనే ఉజ్వల భవిష్యత్తు

- డీజీపీ సి.వి. ఆనందర్
- 'యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్' ప్రారంభం
- 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాలు

**హైదరాబాద్, జూన్ 22:** యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం దేశ బంగారు భవిష్యత్తుకు

మిగతా 3వ పేజీలో..

# తెలంగాణ అభివృద్ధికి బీఆర్‌ఎస్ మోకాలడ్డు

- పదేళ్లలో భ్రష్టు పట్టించిన నేతలే చిల్లర రాజకీయాలు
- హరీష్ రావు, కెటిఆర్‌ల తీరుపై ఎంపి ఆగ్రహం
- సీఎం విజన్‌తో రాష్టా□భివృద్ధి చేస్తున్నారని చామల కితాబు

**యాదాద్రి భువనగిరి, జూన్ 22:** తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవం త్‌రెడ్డి ఓ విజన్‌తో ముందుకెళ్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్య, వైద్యం, రైతులకు మేలు చేయాలనే ఆలో చనతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు పోతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం రే వంత్‌రెడ్డిపై బావ, బామ్మర్దులు ఇష్టానుసా రంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం భువనగిరిలో ఎంపీ చామల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన వి□డియా తో మాట్లాడారు. కేటీఆర్ పదేళ్లు అధికా రంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగి సినిమా మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంలో సినిమా మాటలు మాట్లాడుతున్నారని విమర్శిం చారు. ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సిని మాలాగా కనపడుతున్నాయా.. అని కిరణ్ కుమార్ రెడ్డి

మిగతా 2వ పేజీలో..






## ఓట్, సీట్ చోరీలో బీజేపీ నిమగ్నం

- సర్ ప్రక్రియ ఓట్ల తొలగింపుకే ప్రాధాన్యం
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు వంద ఖాయం
- బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణలో టీపీసీసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హనుమకొండ, జూన్ 22:** సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరు గుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పు డూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ

మిగతా 2వ పేజీలో..

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన



- నాంపల్లి కోర్టుకు హాజరు కాని అల్లు అర్జున్
- షూటింగ్‌ల కారణంగా రాలేకపోయారని వివరణ
- విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు

2

## నటుడు చిరంజీవితో బీజేపీ అధ్యక్షుడు రామ్ భేటీ



2

చురకలు
మంగళవారం23 జూన్ 2026

# సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

**హైదరాబాద్, జూన్ 22:**

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సంధ్య థియేటర్ కేసులో నాంపల్లి కోర్టుకు సినీనటుడు అల్లు అర్జున్ హాజరు కాలేదు. షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఇవాళ కోర్టుకు హాజరుకావాలని 19 మంది నిందితులకు ఇటీవల నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, అల్లు అర్జున్ మినహా మిగతా నిందితులంతా న్యాయమ□ర్తి ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం కేసు విచారణను న్యాయమ□ర్తి కేసు విచారణను జులై 6కి వాయిదా వేశారు. అనంతరం ఈ కేసు విచారణను జులై 6వ తేదీకి న్యాయమ□ర్తి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఎ11 నిందితుడిగా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా అర్జున్ కోర్టు ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. అయితే అల్లు అర్జున్ గైర్హాజరుకు గల కారణాలను న్యాయస్థానానికి ఆయన తరపు న్యాయవాది వివరించారు. సంధ్యా థియేటర్ యాజమాన్యాన్ని తొలి పదిమంది జామితాలో చేర్చగా, మొత్తం 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 19 మంది నిందితులకు నాంపల్లి కోర్టు ఇప్పటికే సమన్లు జారీ చేసింది. ఈ ఘటన 2024 డిసెంబర్ 4వ తేదీన పుష్ప`2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్‌కు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు 23 మందిని నిందితులుగా పేర్కొంటూ నాంపల్లి కోర్టుకు ఛార్జ్‌షీట్ సమర్పించారు. నిందితుల వ్యక్తిగత హాజరు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ కేసులో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు నాంపల్లి కోర్టు సిద్ధమవుతోంది. ఈ కేసు సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారగా, కోర్టు తదుపరి విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# ఓట్, సీట్ చోరీలో బీజేపీ నిమగ్నం

**మొదటిపేజీ తరువాయి**

నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. వి□నాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ వి□నాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎసఐఆర్‌పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో వి□నాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర‌ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆరఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళ్తున్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. వి□నాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆరఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# విద్యుత్ శాఖలో

## నకిలీ ఉద్యోగులపై క్రిమినల్ కేసులు!

**మొదటిపేజీ తరువాయి**

అధికారికి ఆదేశాలు జారీచేశారు.జహీరాబాద్ డివిజన్ లో పనిచేస్తున్న మొహమ్మద్ అలీ పాష, మొహమ్మద్ ఇస్మాయిల్, హన్మంతు, శంకర్ ను ఇప్పటికే విధులనుంచి తొలగించారు. సంస్థను మోసం చేస్తూ ఉద్యోగం పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో భాగంగానే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది.

**మరింత కఠినం!**

ఉద్యోగులు సంస్థను మోసం చేసే ఏ చర్యను యాజమాన్యం సహించదన్న విషయాన్ని ఉద్యోగులకు తెలియజెప్పేందుకు యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే 2020 తరవాత నియామకమైన జేఎల్‌ఎం ల అర్హత కి సంబంధించిన సర్టిఫికేట్ల వెరిఫికేషన్ కు డివిజినల్ స్థాయిలో ఒక కమిటి ని నియమించారు. అందులో నకిలీ సర్టిఫికెట్లు బయటపడితే వారిపైనా క్రిమినల్ చర్యలు తప్పవు. ఇన్నాళ్లు పొందిన ఆర్థిక ప్రయోజనాల రికవరీ ఎలా?

ఐతే నకిలీ సర్టిఫికెట్లతొ ఉద్యోగం పొంది పట్టుబడ్డ నలుగురు ఇప్పటికే కోటి రూపాయలకు పైగా ఆర్థిక ప్రయోజనాలు పొందారు. మరి వాటిని ఎలా రికవరీ చేస్తారు. అన్నది తెలియాల్సి ఉంది.

# భూమి గురించి అడిగితే ఎస్‌బిఐపై పగబట్టారు

**మొదటిపేజీ తరువాయి**



కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐకి ఇచ్చిన భూమిని వేలానికి ఇచ్చిండు.. భూమిని అమ్మేసిండు. అమ్మేస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టుకు వెళ్లింది. మాకు ఎకరం భూమి ఇచ్చిర్రు. ఇది కూడా ఉచితంగా ఏం ఇయ్యలేదు. మేము దాదాపు రూ.20 కోట్లు పెట్టి ఈ భూమి కొనుక్కున్నమని.. ఈ భూమి మా పొజిషన్‌లో ఉన్నది. పైసల్ పెట్టి కొన్న మా భూమి రేవంత్ రెడ్డి ఎట్లా అమ్ముకున్నడు.. అని హైకోర్టుకు పోయారన్నారు.కోర్టు వాళ్లు పైసలు పెట్టి కొన్నది నిజమే కదా ఈ అమ్మకం తప్పు అని స్టే ఇచ్చింది. ఖతం రేవంత్ రెడ్డి ఎస్‌బీఐ వి□ద పగపట్టిండు. ఎస్‌బీఐని నిషేధిస్తాం. ఎస్‌బీఐలో ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లు బయటకు తీసేస్తాం. ఎస్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే ఖాతాలన్ని తీసేస్తా.. అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా బ్లాక్ మెయిల్ చేస్తుండు.. రేవంత్ రెడ్డి తీరు ఎవరన్నా ప్రశ్నిస్తే పగబడ్తమన్నట్టు ఉంది. ఇవాళ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే నిషేధిస్తా అంటున్నడు.. రేపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరల్డ్ బ్యాంక్ కూడా నీ మాట వినలేదనుకో దాన్ని కూడా నిషేధిస్తా అంటాడు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక ఒక బ్యాంక్ అయితే కావాలి కదా.. ఎవరు నీకు వ్యతిరేకంగా మాట్లాడితే ఆ బ్యాంక్‌నే నిషేధిస్తా అంటే మరి ఏం చేస్తడు.. నాకో డౌటు..కొత్తగా కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెడ్తడో ఏమో.. పెట్టినా పెడ్తడు మస్త్ జమ అయినయ్ పైసలు. రేపు ఎనుముల కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెట్టినా పెడ్తరన్నారు హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

**మొదటిపేజీ తరువాయి**

పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమఆర్‌వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సవి□పంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హస్తిన పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామన్నారు.

# హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం

# సానుకూల సంకేతాలు

**న్యూఢిల్లీ, జూన్ 22:**



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశాలు నిర్వహించి రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహాయం, కేంద్ర అనుమతుల అంశాలు ఈ భేటీల్లో ప్రాధాన్యత పొందాయి. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంలో హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణ సహాయం అందించాలని సీఎం కోరారు. దీనిపై కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. మెట్రో విస్తరణకు అవసరమైన నిధుల సమకూర్పు విషయంలో కేంద్రం సానుకూల దృక్పథంతో ఉందని సీఎం వెల్లడించారు. ప్రాజెక్టు పురోగతికి అవసరమైన ఆర్థిక వనరుల కల్పనపై చర్చలు ఫలప్రదంగా జరిగాయని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో మంగళవారం ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు సీఎం తెలిపారు. ఈ సమావేశంలో మెట్రో మౌలిక వసతులు, తుది అనుమతులు, నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేసే అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో మెట్రో విస్తరణ పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరుగుతున్న సమావేశాలు ప్రాజెక్టు భవిష్యత్‌కు కీలకంగా మారనున్నాయి.

# నటుడు చిరంజీవితో బీజేపీ అధ్యక్షుడు రామ్ భేటీ

- మోడీ 12 పాలనపై పుస్తకాలు అందచేత

**హైదరాబాద్, జూన్ 22 :**



తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ వి□డియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'మహాజన్ సంపర్క్ అభియాన' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణలను వివిధ రంగాల ప్రముఖులకు వివరించే ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగానే రామచందర్ రావు చిరంజీవిని కలిసి మోదీ ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో జరిగిన మార్పులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అధికారికంగా ఇది మర్యాదపూర్వక భేటీగా చెబుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాల్లో బిజీ అయిన ఆయన మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి వస్తారా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యంగా బీజేపీతో ఆయన సాన్నిహిత్యం పెరుగుతుందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి తమ్ముడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్‌కు బీజేపీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో చిరంజీవి 'బీజేపీ భేటీకి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ సమావేశం కేవలం మర్యాదపూర్వకంగానే జరిగిందా? లేక భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు సంకేతమా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# డీటీఓ వెంకన్న మరణం విచారకరం

**హైదరాబాద్**

విధి నిర్వహణలో ఉండగా మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న (జిల్లా రవాణాశాఖ అధికారి) ఘోర రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందారని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. విధి నిర్వహణలో డీటీవో వెంకన్న మృతి ఎంతో విచారిస్తున్నామన్నారు. ఈ విషాదకర ఘటన పట్ల రవాణాశాఖ ప్రగాఢ సానుభూతిని వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ తీరని లోటును భరించే ధైర్యాన్ని భగవంతుడు వారికి ప్రసాదించాలని, వెంకన్న ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాము. వెంకన్న కుటుంబ సభ్యులకు రవాణాశాఖ అండగా ఉంటుందని జేటీసీ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. జేటీసీ మృతుడు వెంకన్న పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# చిట్టినాయుడిని వదిలి పెట్టే ప్రసక్తి లేదు

**మొదటిపేజీ తరువాయి**

కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనవి□ద కేసులు పెట్టినోడిని మరిచిపోం. మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు. తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోన్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి వి□ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తుపెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు.

# తెలంగాణ అభివృద్ధికి బిఆర్‌ఎస్ మోకాలడ్డు

**మొదటిపేజీ తరువాయి**

ఆగ్రహించారు. బీఆరఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా...అని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని దుయ్యబట్టారు. బీఆరఎస్ పదేళ్ల పాలన షోలే సినిమా కాదని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలన గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. బీఆరఎస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి క్రాప్ డైవర్షన్‌పై అవగాహన కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పండించిన ధాన్యం అత్యధిక దిగుబడి వస్తే కేందప్రభుత్వం ఎందుకు కొనట్లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని తెలిపారు. మెట్రో ఫేజ్` 2 కోసం సంప్రదింపులు చేసి ఎల్ అండ్‌టీకి ఎగ్జిట్ ఇచ్చారని.. మెట్రో ఫేజ్ `2ను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. మెట్రో ఫేజ్`2పై బీఆరఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మెట్రో ఫేజ్ `2పై కిషన్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించాలని.. కలిసి అభివృద్ధిలో ముందుకెళ్దామని సీఎం అంటున్నారని అన్నారు. కేటీఆర్ బాధ్యతతో ప్రజల కోణంలో మాట్లాడాలని హితవు పలికారు. హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. హైడ్రా హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకంగా మారిందని తెలిపారు. నాళాలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టాలని హైడ్రా భావిస్తోందా...? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం ముంపునకు గురికాకుండా హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. బీజేపీ ఓటు, సీటు చోరీల గురించి కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని గ్□ర్ అయ్యారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై చిత్తశుద్ధి లేని మాటలు మాట్లాడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వర్షా కాలానికి ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యాచరణ

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల అధికారులు పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసేంత వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయిల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, నీటి తొలగింపు పంపులు, ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ సామగ్రి, పైపులు తదితర అవసరమైన పరికరాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.

**వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా**

రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, కట్టల బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థలు జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పోలీస్, రెవెన్యూ, నీటి పారుదల, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాల కారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

**24 గంటల్లో నష్టం అంచనా నివేదిక**

వరద నీరు తగ్గిన వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫొటోలు, స్థాన నిర్ధారణ వివరాలతో నష్టం అంచనా నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అత్యవసర పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఇంజినీర్లు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వరదల అనంతరం చేపట్టే పునరుద్ధరణ పనుల వ్యయాన్ని సంబంధిత నిబంధనల ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. వర్షపాతం తీవ్రతను బట్టి గ్రీన్, ఎల్లో, ఆరెంజ్, రెడ్ రంగుల ఆధారంగా హెచ్చరిక వ్యవస్థను అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

**వర్షపాతం ఆధారంగా అలర్ట్‌లు**

24 గంటల్లో 64.5 మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైతే గ్రీన్ అలర్ట్‌గా పరిగణించి సాధారణ పర్యవేక్షణ కొనసాగించనున్నారు. 64.5 నుంచి 115 మిల్లీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైతే ఎల్లో అలర్ట్ అమల్లోకి వస్తుంది. ఈ పరిస్థితుల్లో సున్నిత ప్రాంతాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాల్సి ఉంటుంది. 115 నుంచి 204 మిల్లీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైతే ఆరెంజ్ అలర్ట్ ప్రకటించి క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడతారు. 204 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైతే రెడ్ అలర్ట్ అమలు చేస్తారు. ఈ పరిస్థితుల్లో అధికారులు 24 గంటలపాటు క్షేత్రస్థాయిలో ఉండి సహాయక చర్యలను సమన్వయం చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లోని ఆర్ అండ్ బీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియంత్రణ కేంద్రానికి ప్రతిరోజూ పరిస్థితుల నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. నష్టం జరగని సందర్భాల్లో కూడా నివేదిక పంపాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను కొనసాగించడం, వరదల నష్టాన్ని తగ్గించడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ఈ ఎస్‌ఓపీ ప్రధాన లక్ష్యమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

చురకలు



# డ్రగ్స్ కు దూరంగా వుంటేనే ఉజ్వల భవిష్యత్తు

మొదటిపేజీ తరువాయి

బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ లో నిర్వహించిన యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సోమవారం నుంచి 26 వరకు పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, వివిధ ప్రభుత్వ శాఖలు, సామాజిక సంస్థల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం, పోలీసు శాఖ సమన్వయంతో కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కీలక ఉపన్యాసం చేసిన డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ యువత కోసమే నిర్వహిస్తున్న కార్యక్రమమని చెప్పారు. విద్యాశాఖ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్, కస్టమ్స్ శాఖలతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశం తీవ్రవాదం, మావోయిజం వంటి అనేక సవాళ్లను అధిగమించి నప్పటికీ, ప్రస్తుతం ప్రతి కుటుంబాన్ని ప్రభావితం చేస్తున్న అతిపెద్ద సమస్య డ్రగ్స్ అని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ అనంతరం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని, డ్రగ్స్‌కు అలవాటుపడిన విద్యార్థులు తమ స్నేహితులను కూడా అదే బాటలో నడిపిస్తున్నారని దర్యాప్తులో వెల్లడైందన్నారు.

"డిమాండ్ లేకపోతే సప్లై ఉండదు. కాబట్టి డ్రగ్స్‌పై డిమాండ్‌ను తగ్గించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది" అని పేర్కొన్నారు. కొంతమంది చిన్నారులను బిస్కెట్లు, చాక్లెట్లు వంటి వస్తువుల ద్వారా డ్రగ్స్‌కు అలవాటు చేస్తున్నారని, ఇది దేశద్రోహానికి సమానమని అన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని డీ అడిక్షన్ కేంద్రాలకు చేర్పించేందుకు కుటుంబ సభ్యులు, సమాజం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ గుండె, మెదడు, ఆరోగ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా కుటుంబ వ్యవస్థను కూడా నాశనం చేస్తాయని డీజీపీ హెచ్చరించారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు పోలీసు వ్యవస్థ మొత్తం డ్రగ్స్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని, విద్యాశాఖ, కస్టమ్స్, డీఆర్ఐ తదితర శాఖల సమన్వయంతో ఈ సమస్యను అరికట్టేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ సేఫ్టీ క్లబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాల్లో డ్రగ్స్ కారణంగా యువత నిర్వీర్యమై, ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం పడిన ఉదాహరణలను గుర్తుచేశారు.

అతిథిగా హాజరైన విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, గత తరాల్లో మాదకద్రవ్యాల సమస్య పెద్దగా కనిపించేదికాదని, ప్రస్తుతం చిన్న వయస్సులోనే విద్యార్థులు డ్రగ్స్ బారిన పడుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. డ్రగ్స్‌ను ఎప్పుడూ ఒక తీసుకుందాం అనే ప్రయత్నం చేయకూడదని, ఒక్కసారి అలవాటు అయితే దాని నుంచి బయటపడటం చాలా కష్టమని హెచ్చరించారు. తమ స్నేహితుల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పెద్దలకు సమాచారం అందించాలని సూచించారు. "ఇది వ్యక్తిగత సమస్య కాదు, సమాజం మొత్తానికి సంబంధించిన సమస్య" అని పేర్కొంటూ, 2029 నాటికి "నషాముక్త భారత్ - నషాముక్త తెలంగాణ" లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ భరాల మాట్లాడుతూ, విదేశాల నుంచి వచ్చే పార్శిళ్లలో మాదకద్రవ్యాల రవాణా పెరుగుతున్నట్లు గమనిస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ యువత కలలను నాశనం చేస్తున్నాయని, ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ శాఖ కూడా కృషి చేస్తోందన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), హైదరాబాద్ జోనల్ యూనిట్ అదనపు డైరెక్టర్ జనరల్ కొండూరు ప్రసాద్ మాట్లాడుతూ, ఒకప్పుడు భారత్ ట్రా



న్సిట్ దేశంగా మాత్రమే ఉండేదని, కానీ ప్రస్తుతం మాదకద్రవ్యాల వినియోగం దేశంలో పెరుగుతుండటం ఆందోళనకరమన్నారు. కొన్ని రకాల డ్రగ్స్‌కు రంగు, రుచి ఉండవని, వాటిని తీసుకున్న వ్యక్తి 48 గంటల వరకు మత్తులో ఉండే ప్రమాదం ఉందని విద్యార్థులను హెచ్చరించారు. హైదరాబాద్ ఈగల్ ఫోర్స్, పోలీసుల కఠిన చర్యల వల్ల నగరంలో డ్రగ్స్ రవాణాపై భయం నెలకొన్నదని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సిపి సజ్జనార్, కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ అజాజుద్దీన్ ఐఆర్ఎస్, రెవెన్యూ ఇంటెలిజెన్స్ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ కొండూరు ప్రసాద్ , విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా, ఈడీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ భరాల ఐఆర్ఎస్ తదితర అధికారులతోపాటు పంజాగుట్ట, రసూల్ పుర, బేగంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, సెయింట్ మేరీస్ కాలేజ్ ,టి కె ఆర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# కేరళ తరహాలో కళాకారులను ప్రోత్సహించాలి

- ఘనంగా 'అర్ధనారీశ్వరం' జాతీయ నృత్యోత్సవం
- కళాకారులను సత్కరించిన భట్టి, జూపల్లి

**హైదరాబాద్, జూన్ 22 :**

రాష్ట్రంలో ప్రాచీన కళలు, సంస్కృతిని కాపాడుకుంటూనే కళాకారులకు ఉపాధి కల్పించేలా దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో సోమవారం ఘనంగా నిర్వహించిన 'అర్ధనారీశ్వరం నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గతంలో లలిత కళలన్నింటికీ దేవాలయాల ప్రాంగణాలే ప్రధాన వేదికలుగా ఉండేవని గుర్తు చేశారు. ఆనాడు పాలకులు సమాజానికి ఇవ్వాలనుకున్న భక్తిభావనను, సామాజిక సందేశాలను నృత్య, కళా రూపాల ద్వారా ప్రజలకు రక్తికట్టేలా, సులువుగా అర్థమయ్యేలా వివరించేవారని కొనియాడారు. సాంస్కృతిక, పర్యాటక, దేవాదాయ శాఖలు చేతులు కలిపి ఉమ్మడి కార్యక్రమాలు చేపడితే రాష్ట్రంలో అద్భుతమైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళ తరహాలో ఇక్కడా పర్యాటక ప్రాంతాల్లో స్థానిక కళలను ప్రదర్శించేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రంలో పర్యాటకులు సందర్శించే ప్రదేశాలలో సాయంత్రం వేళల్లో మన సంప్రదాయ కళారూపాలను ప్రదర్శిస్తే అటు పర్యాటకులకు వినోదంతోపాటు ఇటు కళాకారులకు ఉపాధి, తగిన ప్రోత్సాహం లభిస్తాయని చెప్పారు. అటు ఆలయాల్లో, ఇటు పర్యాటక ప్రాంతాల్లో కళలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది అని పేర్కొన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఈ దిశగా చక్కని ప్రణాళికలతో పనిచేస్తారనే నమ్మకం తనకు ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి స్పష్టం చేశారు.

**పురుషాధిక్యత కాదు.. సమానత్వమే 'అర్ధనారీశ్వరం'**

'అర్ధనారీశ్వరం' ప్రదర్శనపై స్పందిస్తూ భారతీయ సంస్కృతిలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేననే ఉదాత్తమైన భావనను ఇది చాటుతుందని చెప్పారు. సృష్టిలో పురుష శక్తి, స్త్రీ శక్తి కలిసి సాగాలని, ఒకరికొకరు గౌరవించుకుంటూ, అభినందించుకుంటూ కలిసి పనిచేస్తే ఆ శక్తిని




మించింది ఏదీ లేదనే గొప్ప సందేశం ఇందులో ఉందని వివరించారు. దేశం నలుమూలల నుండి ఈ ఉత్సవానికి విచ్చేసిన నృత్య కళాకారులకు డిప్యూటీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే అతిథులను ప్రేమతో ఆహ్వానించి ఆతిథ్యం ఇవ్వడంలో రాష్ట్రానిది ప్రత్యేక శైలి అని, ఇక్కడి ఆతిథ్యాన్ని కళాకారులు ఆస్వాదిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సత్కరించార.T ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజల పాల్గొన్నారు.

# ప్రతీ ఓటును కాపాడాలి..

# బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి

- ఓటు హక్కుపై దాడిని కాంగ్రెస్ తిప్పికొడుతుంది
- ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం వద్దు.. ఇంటింటికీ వెళ్లాలి
- వరంగల్ పశ్చిమ బీఎల్‌ఏల అవగాహన సదస్సులో పీసీసీ చీఫ్, ఏఐసీసీ ఇన్‌చార్జి

**హన్మకొండ, జూన్ 22:**

హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఆధ్వర్యంలో హంటర్ రోడ్డులో సోమవారం నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సు, ఓటర్ల జాబితా సవరణపై బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లు హాజరయ్యారు. వీరికి నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బీఎల్‌ఏల శిక్షణ సదస్సులో నేతలు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్లను జాబితాల నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో ఎన్నోసార్లు ఎస్ఐఆర్ ప్రక్రియలు జరిగినప్పటికీ ప్రస్తుతం అమలు చేస్తున్న విధానం భిన్నంగా ఉందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు మించిన హక్కు మరొకటి లేదని, దానిని



కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కనుసన్నల్లో ఎన్నికల సంఘం పనిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా భావిస్తున్న ముస్లింలు, ఎస్సీలు, ఎస్టీలు, గిరిజన వర్గాల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల జాబితా సవరణల కారణంగా ప్రతిపక్షాలకు నష్టం జరిగిందని పేర్కొన్న ఆయన, ప్రజా ఆగ్రహానికి గురైనప్పుడు ఎంతటి నాయకులైనా ఓటమిని తప్పించుకోలేరని హెచ్చరించారు.

**అత్యంత అప్రమత్తంగా ఉండాలి**

ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న బీఎల్ఏ2 ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత అప్రమత్తంగా నిర్వహించాలని ఏఐసీసీ రాష్ట్ర వ్యవ హారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు జాబితాలో కొనసాగేందుకు కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పనిచేయాలని కోరారు. ముఖ్యంగా పేద ప్రజలు ఈ ప్రక్రియలో మోసపోయే ప్రమాదం ఉన్నందున వారి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపయోగించి బీజేపీకి అనుకూలమైన ఓట్లను నిలుపుకొని, ఇతర వర్గాల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని ఆరో పించారు. ఇప్పటివరకు ఎస్ఐఆర్ అమలైన రాష్ట్రాల్లో భారీ స్థాయిలో ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ విషయంలో ఏమరపాటుగా ఉంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చ రించిన ఆమె ఎన్నికలు సమీపించిన తర్వాత ఓటు నమోదు చేసుకుంటామని నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. మన ప్రభుత్వం ఉంది కాబట్టి అన్నీ సవ్యంగా జరుగుతాయని భావించడం పొరపాటని, ప్రతి కాంగ్రెస్ బీఎల్ఏ, ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. తన రాజ్యసభ స్థానానికి సంబంధించిన అంశాన్ని ప్రస్తావిస్తూ మొదట ఓట్లను చోరీ చేశారు. తర్వాత నా రాజ్యసభ సీటును చోరీ చేశారు. అవసరమైతే రాజకీయ పార్టీలను కూడా చోరీ చేసే పరిస్థితులు సృష్టిస్తున్నారని విమర్శించారు.

**ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో ఉండాలి**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు అత్యంత విలువైందన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ శ్రద్ధగా పని చేస్తుందన్నారు. బీఎల్ఏ 2 క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలన్నారు. యువత, మహిళలు, వలస కార్మికులు, అట్టడుగు వర్గాలకు చెందిన అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమన్వయంతో పని చేస్తూ ప్రతి ఓటరును చేరుకోవాలన్నారు. 2002 తరువాత స్పెల్లింగ్ మిస్టేక్, బూత్ ల పెంపు లాంటివి జరిగాయని, 25 నుండి సర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. బెంగాల్ ,తమిళనాడులో లక్షలాది ఓట్లు తొలగించారన్నారు. మన దగ్గర కూడా ఓట్లు తొలగించాలని చూస్తున్నారని మా నియోజకవర్గంలో 309 బూత్‌లలో మ్యాపింగ్ ఓట్ల సవరణ అంశం ఒక బిఎల్‌ఏ లు అధికారుల కంటే అప్రమత్తంగా ఉండాలన్నారు. మీరు ఫారం నింపి ఏఈర్వోలకు అందించాలన్నారు. సమావేశంలో బిఎల్ఏ సదస్సు ఇంచార్జ్, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లు రియాజ్, కుసురు పాషా,డీసీసీ అధ్యక్షులు వెంకట్రామ్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి లు దుద్దిళ్ల శ్రీనివాస్,నామిండ్ల శ్రీనివాస్ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు,బూత్‌స్థాయి నాయకులు,కార్యకర్తలుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లి మందలింపుతో పారిపోయిన అక్కాచెల్లెళ్లు

- ఏలూరులో ప్రత్యక్షమైన సోదరీమణులు

**హైదరాబాద్, జూన్ 22:**

తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్‌లో అదృశ్యమైన ఆ ముగ్గురూ ఏపీలో ప్రత్యక్షమయ్యారు. ఈ ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫోన్ ఎక్కువగా చూస్తున్నారని తన ముగ్గురు కుమార్తెలను తల్లి మందలించింది. దీంతో ఆ ముగ్గురూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో తన పిల్లలు కనిపించడం లేదని వారి తల్లి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఏలూరులో ఉన్నట్లు తేలింది. వారిని తిరిగి హైదరాబాద్ తీసుకొస్తున్నారు.

## భూపాలపల్లి జిల్లాలో దుర్ఘటన

- వాహనాలు తనిఖీ చేస్తుండగా దూసుకొచ్చిన లారీ
- అక్కడికక్కడే డీటీఓ వెంకన్న మృతి

**జయశంకర్ భూపాలపల్లి, జూన్ 22:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం మండలం చెల్పూరు శివారులో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. రవాణా శాఖ కార్యాలయం ఎదుట జిల్లా రవాణా అధికారి డీటీఓ వెంకన్న వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, బొగ్గు లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి ఆయనపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకన్నకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకన్న మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## పీజీ డిప్లొమా కోర్సులకు ఎన్ఎంసీ గుడ్‌బై

- 2027-28 నుంచి డిప్లొమా అడ్మిషన్లు పూర్తిగా నిలిపివేత
- పీజీ డిప్లొమా సీట్లన్నీ ఎండీ, ఎమ్ఎస్ కోర్సులుగా మార్పు : డా. రాఘవ్ లాంగర్
- వైద్య విద్య ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం : ఎన్ఎంసీ
- సీట్ల మార్పిడికి కాలేజీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- సీకే రామస్వామి

**న్యూఢిల్లీ, జూన్ 22:**

దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో నిర్వహిస్తున్న పీజీ డిప్లొమా కోర్సులను పూర్తిగా రద్దు చేయాలని నేషనల్ మెడికల్ కమిషన్ నిర్ణయించింది. వైద్య విద్య ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు స్పెషలిస్ట్ శిక్షణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషన్ వెల్లడించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పీజీ డిప్లొమా సీట్లన్నింటినీ పీజీ బ్రాడ్ స్పెషాలిటీ డిగ్రీ కోర్సులైన ఎండీ, ఎమ్ఎస్ సీట్లుగా మార్చాలని ఎన్ఎమ్‌సీ ఆదేశించింది. ఈ మార్పులు 202728 విద్యాసంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో అమల్లోకి రానున్నాయి.

**2026-27 చివరి అడ్మిషన్ల సంవత్సరం**

ప్రస్తుత 202627 విద్యాసంవత్సరమే పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు చివరి సంవత్సరం అవుతుందని ఎన్ఎమ్‌సీ సెక్రటరీ డా. రాఘవ్ లాంగర్ తెలిపారు. 202728 విద్యాసంవత్సరం నుంచి డిప్లొమా కోర్సుల్లో ఎలాంటి అడ్మిషన్లు ఉండవని, ఆ తర్వాత ఆ కోర్సులు పూర్తిగా నిలిచిపోతాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా వైద్య విద్యలో నాణ్యత పెరగడంతో పాటు నిపుణ వైద్యుల తయారీకి మరింత ప్రాధాన్యం లభిస్తుందని ఎన్ఎమ్‌సీ భావిస్తోంది.

**సీట్ల మార్పిడికి దరఖాస్తులు**

ప్రస్తుతం పీజీ డిప్లొమా కోర్సులను నిర్వహిస్తున్న మెడికల్ కాలేజీలు, విద్యాసంస్థలు వాటిని ఎండీ, ఎమ్ఎస్ కోర్సులుగా మార్చుకోవాలంటే మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దీని కోసం ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎన్ఎమ్‌సీ తెలిపింది. కాలేజీల్లోని మౌలిక వసతులు, అధ్యాపక సిబ్బంది, వైద్య సేవల సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే సీట్ల మార్పిడికి అనుమతులు మంజూరు చేస్తామని బోర్డు డైరెక్టర్ సి.కె. రామస్వామి వెల్లడించారు. దరఖాస్తు ప్రక్రియ, కాలపరిమితి, ఇతర మార్గదర్శకాలకు సంబంధించిన పూర్తి వివరాలను మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు త్వరలో ప్రత్యేకంగా విడుదల చేయనుంది. ఈ నిర్ణయం దేశంలోని వైద్య విద్యా వ్యవస్థలో కీలక మార్పులకు దారితీయనుందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## ధాన్యం అక్రమ తరలింపు కేసులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

**సిరిసిల్ల, జూన్ 22**: ప్రభుత్వ ధాన్యం అక్రమ తరలింపు కేసులో నిందితుడిగా ఉన్న జిల్లా పౌరసరఫరాల శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కె రాజశేఖర్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు జిల్లా అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్ ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన ధాన్యం అక్రమ తరలింపు వ్యవహారంలో రాజశేఖర్ పాత్ర ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు. కేసులో నిందితుడిగా ఉన్న నేపథ్యంలో అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. విచారణ బాధ్యతలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌కు అప్పగించారు. ధాన్యం అక్రమ తరలింపుకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విచారణ నివేదిక అందిన అనంతరం బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ ధాన్యం అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## ఎస్ఐఆర్‌పై తప్పుడు ప్రచారాలు

**హైదరాబాద్, జూన్ 22 :**

ఎస్ఐఆర్ అనేది ఓటరు జాబితాను స్వచ్ఛంగా, పారదర్శకంగా, కచ్చితత్వంతో రూపొందించేందుకు చేపట్టే సాధారణ ఎన్నికల ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియ మాత్రమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. మల్కాజ్‌గిరి బీజేపీ కార్యకర్తల ఎసఐఆర్ వర్క్‌షాప్‌లో ఆయన ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజల్లో అనవసర భయాలు సృష్టిస్తున్నాయన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త అత్యంత గంభీరతతో, బాధ్యతతో ఈ ప్రక్రియలో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. డిటెక్టు, డిలీట్, డీపోర్టు స్ఫూర్తితో ఈ ప్రక్రియ ద్వారా అక్రమ బంగ్లాదేశీ, రోహింగ్యా చొరబాటుదారులను గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు కూడా దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మర్రి శశిధర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మహేందర్, జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.






# దేశవ్యాప్తంగా ఎల్‌నినో ఆందోళన!

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. చినుకు పడడమే కష్టంగా మారింది. నైరుత ప్రవేశించినా చుక్కనీరు చిక్కలేదు. భూములు తడవలేదు. వ్యవసాయం పూర్తిగా పడకేసింది. నదులు నోరెళ్లబెట్టాయి. భూగర్భజలాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సాగు ఎలా ఉన్నా తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడేలా ఉంది. కృష్ణా,గోదావరి నదులు వట్టిపోయాయా అన్నట్లుగా మారాయి. ఈ పాటికి గోదావరిలో ఎగువ నుంచి నీరు వచ్చేది. దీంతో సాగు సాగేదెలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో పంటల ఎంపికపై తీసుకునే నిర్ణయాలు విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని వాతావరణ శాఖ తెలియచేస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు నిరంతరం మారుతుంటాయని, రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితిలో మెరుగుదల సంభవించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ రైతాంగం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మృగశిర కార్తెతో పాటు ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకుంది. జూన్ తొలి వారం నుంచే నాగలి పట్టి, నారుమళ్లు పోసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. అయితే సాధారణంగా కనిపించే నైరుతి వర్షపాత చురుకుదనం ఈసారి అనేక ప్రాంతాల్లో కనిపించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. వాతావరణ మార్పుల కారణంగా నైరుతి రుతుపవనాల పురోగతిపై ప్రభావం చూపుతున్నాయి. భారత వాతావరణ శాఖకు సంబంధించిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రచురితమైన నివేదికల ప్రకారం, వ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్య మవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

# సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

- భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం
- పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు



**ఇస్లామాబాద్, జూన్ 22:** సింధు జలాల కోసం అవసరమైతే భారత్‌తో యుద్ధం చేస్తామని పాక్ ప్రగల్భాలు పలికింది. సింధు జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గేది లేదని భారత్ స్పష్టం చేసిన నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్ చర్యలు తమ నీటి సరఫరాకు ముప్పు కలిగిస్తున్నాయని, అవసరమైతే ఆ దేశంపై యుద్ధానికి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదానికి పూర్తిగా, విశ్వసనీయంగా అడ్డుకట్ట వేయకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పింది. కాగా, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించే లేదా అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది జాతీయ భద్రతా సమస్యగా మారుతుందని ఆసిఫ్ అన్నారు. పాక్ ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది ప్రజల జీవనాధారం సింధు నదీ వ్యవస్థపై ఆధారపడి ఉందని ఆసిఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు అన్ని మార్గాలనూ ఉపయోగిస్తామని, అవసరమైతే యుద్ధం వరకు వెళ్లడానికి కూడా వెనుకాడబోమని ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదులను భారత్, పాకిస్థాన్‌కు సమానంగా కేటాయించారు. ఒప్పందం ప్రకారం రావి, బియాస్, స్లటెజ్ నదులపై భారత్‌కు హక్కులుంటాయి. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులుంటాయి. అలాగే పాకిస్థాన్‌కు కేటాయించిన మూడు నదులపై కూడా భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు ఉన్నాయి. పాక్‌కు కేటాయించిన నదులపై భారత్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. తాగునీరు, గృహ అవసరాలకు నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే పరిమిత స్థాయిలో సాగునీటికి కూడా ఉపయోగించు కోవచ్చు. అయితే నదుల ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే హక్కు భారత్‌కు లేదు. కాగా, ఇటీవలి ఉగ్రవాద ఘటనల తర్వాత భారత్ ఈ ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగితే పాత విధానంలో ఒప్పందం కొనసాగదని భారత్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చీనాబ్, జీలం నదులపై కొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఈ నిర్మాణాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.



# ఖతార్ గ్యాస్ క్షేత్రంలో పేలుడు

## 54మందికి తీవ్ర గాయాలు..

## 18మంది ఆచూకీ గల్లంతు

**ఖతార్, జూన్ 22:** ప్రపంచ గ్యాస్ వాణిజ్యానికి ఆయువుపట్టు వంటి ఖతార్ రస్ లఫాన్ క్షేత్రంలో బర్జాన్ ప్లాంట్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 54 మంది గాయపడగా.. 18మంది జాడ గల్లంతైంది. ఈ పేలుడుతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అలాగే ప్రాణనష్టంపై వివరాలు అందాల్సి ఉంది. వాస్తవానికి ఇరాన్–అమెరికా యుద్ధం వేళ ఐఆర్‌జీసీ దళాలు ఈ గ్యాస్ క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకొని భారీగా దాడులు చేశాయి. దీంతో గ్యాస్ ప్లాంట్ దెబ్బతిని భారీగా ఉత్పత్తి సామర్థ్యం పడిపోయింది. కొన్నాళ్ల క్రితమే ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గు ముఖం పట్టడంతో గ్యాస్ ఉత్పత్తి తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ చర్యలు చేపట్టింది. ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో పర్షియన్ గల్ఫ్ తీరంలో రస్ లఫాన్ నగరం ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉండటంతో ఇది ఆసియా, ఐరోపా ఎగుమతులకు అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడి నుంచి గ్యాస్ దాదాపు 30 దేశాలకు పైగా ఎగుమతి అవుతోంది. వీటిల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన జపాన్, దక్షిణ కొరియా, భారత్, ఐరోపా సమాఖ్య, చైనా వంటి దేశాలు ఉన్నాయి. భారత ఎల్‌ఎన్‌జీ దిగుమతుల్లో ఖతార్ నుంచి 40–47శాతం వరకు హర్మూజ్ జలసంధి దాటుకొని వస్తున్నాయి. ఈ గ్యాస్ క్షేత్రాన్ని ఖతార్ ఎనర్జీనే నిర్వహిస్తుంది. భారత్–ఖతార్ మధ్య 2024లో 78 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం జరిగింది. దీని ప్రకారం 2028 నుంచి 20 ఏళ్లపాటు ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్‌ఎన్‌జీ సరఫరా చేయాల్సి ఉంటుంది. ఖతార్ ఎల్‌ఎన్‌జీ భారత్‌లో విద్యుత్తు, ఎరువుల ఉత్పత్తి, పరిశ్రమలు, గృహోపయోగానికి చాలా కీలకం. అమెరికా, ఆఫ్రికాతో పోల్చుకొంటే ఇక్కడి నుంచి భారత్‌కు గ్యాస్ తరలించడం చాలా చౌక.

# అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి




**హైదరాబాద్, జూన్ 22:** ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థి అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణకు చెందిన 26 ఏళ్ల అరుణ్ సాయి రెడ్డి బొల్లెందుల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అరుణ్ స్వస్థలం మహబూబ్‌నగర్. ప్రస్తుతం ఫ్లోరిడాలోని టెంపాలో నివసిస్తోన్న అతడు.. స్టెమ్ ఓపీటీలో ఉన్నాడు. ఫుల్ టైమ్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోన్న అరుణ్.. జూన్ 19న ఉన్నట్టుండి అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# లఖ్‌నవూ కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

## 15కు చేరిన మృతుల సంఖ్య

## భవనంపై నుంచి దూకిన విద్యార్థులు

## ప్రధాని మోదీ తీవ్ర విచారం

## రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన




**లఖ్‌నవూ:** ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో గుండెలవిసే ఘోర ప్రమాదం సంభవించింది. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య 15కు చేరింది. మృతుల్లో పలువురు విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు భవనమంతటా వేగంగా వ్యాపించడంతో, ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు విద్యార్థులు భవనం పైఅంతస్తుల నుంచి కిందికి దూకారు. ఇందుకు సంబంధించిన భయానక దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. స్థానిక అలీగంజ్ ప్రాంతంలోని ఒక మూడంతస్తుల భవనం పైభాగంలో తొలుత మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే ఆ మంటలు పైఅంతస్తులో నడుస్తున్న కోచింగ్ సెంటర్‌కు దట్టమైన పొగతో పాటు వేగంగా ఎగబాకాయి. భవనం లోపల చిక్కుకుపోయిన వారు ప్రాణభయంతో కేకలు వేశారు. ఒక వ్యక్తి పగిలిన కిటికీ గుండా బయటకు వచ్చే ప్రయత్నంలో కిందికి పడిపోగా, స్థానికులు వెంటనే స్పందించి అతడిని రక్షించి ఆసుపత్రికి తరలించారు. మరికొందరు భవనం వెలుపల ఉన్న విద్యుత్, కేబుల్ తీగలను పట్టుకుని వేలాడుతూ కిందకు దిగేందుకు ప్రయత్నించారు. ప్రమాదం జరిగిన అరగంట వరకు ఫైర్ ఇంజిన్లు రాలేదని, ఆ ఆలస్యం వల్లే మంటలు ఇంత భారీగా వ్యాపించి ప్రాణనష్టం పెరిగిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం క్షతగాత్రులకు స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తుండగా, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



### ప్రధాని మోదీ తీవ్ర విచారం

లఖ్‌నవూ అగ్నిప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున నష్టపరిహారం అందిస్తామని ప్రధాని ప్రకటించారు.

### లఖ్‌నవూకు బయలుదేరిన సీఎం యోగి

ఈ ఘోర ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాన్ని వెంటనే సందర్శించి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించేందుకు వీలుగా, తన అలీగఢ్ పర్యటనను మధ్యలోనే కుదించుకుని సీఎం యోగి అత్యవసరంగా లఖ్‌నవూకు తిరుగుపయనమయ్యారు.

### కాంగ్రెస్ నేతల సంతాపం

ఈ ప్రమాద ఘటన కలచివేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ విడివిడిగా పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఖర్గే హామీ ఇస్తూ, క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సహాయం, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రాహుల్ గాంధీ తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

చురకలు

మంగళవారం23 జూన్ 2026

## రిపోర్టర్ నర్సింలు కుటుంబాన్ని పరామర్శించిన గజ్వేల్ నాయకులు

**గజ్వేల్ టౌన్, జూన్ 22, :**



గజ్వేల్ మండలం బంగ్లా వెంకటపూర్ గ్రామానికి చెందిన రిపోర్టర్ నర్సింలు ద్వితీయ కుమార్తె రాగిని ఇటీవల క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుని మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ కు చెందిన నాయకులు గుంటుకు శ్రీనివాస్, నక్క రాములు, వార్త రిపోర్టర్ వెంకటేష్ సమాజాసేవకులు డాక్టర్ దేశబోయిని నర్సింహులు తో కలిసి నర్సింలు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాగిని మరణం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. క్షణిక ఆవేశంలో తీసుకునే ఇలాంటి నిర్ణయాలు తల్లిదండ్రులకు కోలుకోలేని శోకాన్ని మిగులుస్తాయని అన్నారు. నేటి యువతీ యువకులు నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా, చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పుట్టెడు దుఃఖంలో ఉన్న రిపోర్టర్ నర్సింలు కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

### సర్పంచ్ పగడాల

**దమ్మపేట, జూన్ 22 :**



వర్షాకాలంలో మురుగు కాలువల వలన ప్రజలు ఇబ్బందులు పడకుండా సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, 12వ వార్డు సభ్యురాలు దాసరోజు సరిత రామారావు సోమవారం జే.సి.బి సహాయంతో 12వార్డు పరిధిలోని వీధుల్లో చెత్త, పూడిక తీయించి మురుగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా డ్రెయిన్లు తీయించారు. వర్షాకాలంలో ముఖ్యంగా వచ్చే వ్యాధులు మలేరియా, డెంగ్యూ ,టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, కలరా, శ్వాసకోశ అంటువ్యాధులు ఫ్లూ వంటివి కేసులు పంచాయతీ పరిధిలో నమోదు కాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నాం అని సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, పసుమర్తి కుసుమాంబ, పూనెం పోలమ్మ, చిన్నశెట్టి ముక్తేశ్వరరావు, ఉయ్యాల లక్ష్మీనారాయణ, చిన్నశెట్టి గోపి, పగడాల గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

### ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 22, :**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం సూరారం గ్రామంలోని విశ్వకర్మ కాలనీలోని వారి నివాసంలో ఘనంగా జరుగగా ఈ వేడుకల కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ , ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు లు ముఖ్యఅతిథులుగా హాజరై కొండకల్ల శ్రీనివాస్ రెడ్డితో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాసేవలో మరింత అభివృద్ధి చెందాలని శ్రీనివాస్ రెడ్డిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, సీనియర్ నాయకులు వారాల వినోద్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, సిద్దిక్, నాయకులు, అభిమానులు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మౌళిక వసతుల కల్పనే ధ్యేయంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నాం

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 22, :**



గాజుల రామారం డివిజన్ వీనస్ రాక్ హైట్స్ కాలనీలో దాదాపు 1.30 కోట్ల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా, మౌళిక వసతుల కల్పన ద్వారానే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని, గడిచిన 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీనస్ రాక్ హైట్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.సీ. వేమారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజేష్, ప్రధాన కార్యదర్శి మురళీధర్ రెడ్డి, సలహాదారులు శివ రామ ప్రసాద్, శంకర్ రెడ్డి, మధు, సంయుక్త కార్యదర్శి బాల నాగ దుర్గా, కోశాధికారి అరవింద్, సభ్యులు, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు నవాబ్, మూసా ఖాన్, తారా సింగ్, సాయిబాబా, మసూద్, చిన్నా చౌదరి, మహేష్, నవీన్ దండుగుల, షేక్ జునైద్, ప్రసాద్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేట ప్రధాన రహదారి డివైడర్ పై మొక్కలు నాటనున్న ఎమ్మెల్యే జారె

**దమ్మపేట, జూన్ 22, :**



దమ్మపేట పట్టణ సుందరీకరణలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి మరియు కాలుష్యాన్ని తగ్గించడానికి సుమారు రెండు కిలోమీటర్ల పొడవు ఉన్న ప్రధాన రహదారి డివైడర్ పై మొక్కలు నాటే కార్యక్రమం 23వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఎం.పి.డి.ఓ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్నది అని, ఈ కార్యక్రమానికి దమ్మపేట ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి అని సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత్ కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం శ్రీ గాయత్రీ ఆశ్రమం వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర గురు జీ ఆహ్వానం మేరకు ఆశ్రమంను సందర్శించిన పాలక వర్గ సభ్యులు తదనంతరం ఆశ్రమం వద్ద ప్రధాన రహదారి డివైడర్ పై మొక్కలు వేయడానికి గోతులను తీయించారు. ఇటీవల డివైడర్ పై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే, తదనంతరం ఎండాకాలం దృష్ట్యా మొక్కలు వేసే పనిని నిలుపదల చేసిన అధికారులు వర్షాకాలం ఆరంభమై వర్షాలు పడుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన వన మహోత్సవంలో దమ్మపేట ప్రధాన రహదారి డివైడర్ పై మొక్కలు వేసే కార్యక్రమంకి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, చాట్ల శ్రీనివాసరావు, రూపా రాంబాబు, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, దాసరోజు సరిత రామారావు, పసుమర్తి కుసుమాంబ, బద్దె వెంకటలీల రాంబాబు, పూనెం పోలమ్మ షేక్ గోరె, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, గ్రామస్తులు చిన్నశెట్టి గోపి, రొయ్యల కుమార్, సిబ్బంది వెంకటేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం..

- **ఆరూర్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం**

**సదాశివపేట, జూన్ 22 :**



సదాశివపేట మండలంలోని ఆరూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ నాయకోటి లావణ్య–మధు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే గ్రామపంచాయతీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎస్సీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు.రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం కాలనీ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రావడంతో పాటు పరిశుభ్రత, భద్రత, జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. గ్రామాభివృద్ధిలో భాగంగా అవసరమైన మౌలిక వసతుల కల్పనకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.గ్రామానికి ఈ నిధులు మంజూరు అయ్యేలా కృషి చేసి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన మాజీ సర్పంచ్ శ్రీ నాయకోటి మధుకు గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మ్యాదరి విఠల్, గ్రామపంచాయతీ సభ్యులు టేకూరి అంజయ్య, మన్నె నాగేష్, రవి–భాగ్యలక్ష్మి , భరతమ్మ–బాలయ్య భరత్, రమేష్, పద్మ–లక్ష్మణ్, లక్ష్మి , గ్రామ పెద్దలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 22, :**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఆదివారం పేద ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండే లక్ష్యంతో బాల బ్రహ్మచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు రూపాయల కాయిన్‌తో 20 లీటర్ల ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో స్వచ్ఛమైన తాగునీరు అందించడం ఎంతో అభినందనీయమైన కార్యక్రమమని తెలిపారు. ముఖ్యంగా డబుల్ బెడ్‌రూమ్ నివాసులకు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టిన బాల బ్రహ్మచారి గారిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూమ్ కాలనీ నివాసులు బాల బ్రహ్మచారి, సత్యనారాయణ, నందకుమార్, దుర్గాప్రసాద్, నరేష్, అశోక్ రావు, నరసింహ, మల్లేష్, రాజు, బాలకృష్ణ, సంతోష్, బద్రీనాథ్, రాము, శంకర్, సత్యవతి, నాగమణి, రజిత, రాములమ్మ, మంజుల, రోషమ్మ, దీపిక, సంజన తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానిక కాలనీ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులోకి రావడం పట్ల కాలనీ నివాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర కీలకం

### ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**మానకొండూర్ ప్రతినిధి, జూన్ 22, :**




ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని సాయిరాం గార్డెన్‌లో సోమవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బీఎల్ఓ,సూపర్ వైజర్లకు నిర్వహించి అవగాహన శిబిరానికి ఆయన ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తిని కలిగి ఉంటుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటర్ల జాబితా ఎంతో అవసరమని అన్నారు.ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు చేసుకోవడం ఎంత ముఖ్యమో, జాబితాలోని అర్హులైన వారి పేర్లు తొలగింపునకు గురి కాకుండా చూసుకోవడం అంతే ముఖ్యమన్నారు. కేంద్ర చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఓటర్ల పేర్లు జాబితా నుంచి అక్రమంగా తొలగింపునకు గురి కాకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడం, తప్పులు ఉండటం లేదా చిరునామా మార్పులు వంటి పొరపాట్లను వెంటనే సవరించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడూతూ ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవడం, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలకు సంబంధించి ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. సర్ విధులు నిర్వహించే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ శిబిరంలో తహసీల్దార్లు కర్ర శ్రీనివాస్ రెడ్డి (తిమ్మాపూర్), ఇప్ప నరేందర్ (గన్నేరువరం), సురేష్ (ఇల్లంతకుంట), శ్రీకాంత్ (బెజ్జంకి), విజయ్ కుమార్ (మానకొండూర్), కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గోదారి శోభారాణితోపాటు పలువురు ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## టిపీసీసీ చీఫ్, ఏఐసీసీ ఇంచార్జ్ కు ఘనస్వాగతం పలికిన మంత్రి కొండా సురేఖ కొండా మురళీధర్ రావు

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జూన్ 22, :**



వరంగల్ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు ఘన స్వాగతం పలికారు. అనంతరం వరంగల్ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో వారితో ప్రత్యేకంగా సమావేశమై పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకత్వంతో అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు చేరువయ్యేలా సమిష్టిగా కృషి చేయాలని నాయకత్వం సూచించగా, ఆ దిశగా కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణ రావు, ఎంపీ కావ్య, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు, ఆన్లైన్ బెట్టింగ్స్‌కు యువత బానిసలు కావద్దు

- **సిద్దిపేట సీపీ సాధన రష్మీ పెరుమాళ్**



**తొగుట, జూన్ 22, :** మాదకద్రవ్యాలకు, ఆన్లైన్ బెట్టింగ్స్‌కు యువత బానిసలు కావద్దని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. తొగుట మండలం గుడికందుల గ్రామంలో "మన ఊరు మన పోలీస్" కార్యక్రమం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని వెల్లడించారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లవద్దని హితవు పలికిన సీపీ ప్రతి ఒక్కరూ జీవితానికి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. లక్ష్యం లేని జీవితం దారి తప్పుతుందని, క్రమశిక్షణతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ యువతకు, పోలీసులకు మధ్య వాలీబాల్ టోర్నమెంట్‌ను సీపీ రష్మీ పెరుమాళ్ ప్రారంభించారు. క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, స్నేహ భావం పెంపొందుతుందన్నారు. గుడికందుల గ్రామస్తులు ఘన స్వాగతం పలకడంపై సీపీ అభినందనలు తెలిపారు. పోలీసులు, ప్రజల మధ్య సఖ్యత పెరగాలని, సమాచారం అందించి నేరాలను అరికట్టడంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పోలీస్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వివాహానికి హాజరై ఆశీర్వదించాలని సీఐ దగ్గు మల్లేష్ యాదవ్ కు ఆహ్వాన పత్రికను అందజేసిన సర్పంచ్ ఎలిగేటి తిరుపతి

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జూన్ 22,**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పోతుగల్లు గ్రామ సర్పంచ్ ఎలిగేటి తిరుపతి వివాహం జూన్ 25, 2026న మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ అమ్మ గార్డెన్ లో జరుగుతున్నది. ఈ వివాహ వేడుకలకు సకుటుంబ సమేతంగా హాజరై ఆశీర్వదించాలని పోతుగల్లు గ్రామ సర్పంచ్ సోమవారం చిట్యాల సీఐ దగ్గు మల్లేష్ యాదవ్, మొగుళ్ళపల్లి తహసిల్దార్ జాలీ సునీతా రెడ్డి, ఎంపీడీవో గోడిశాల సురేందర్ గౌడ్, మొగుళ్లపల్లి ఎస్ఐ ముప్పు సురేష్, టేకుమట్ల ఎస్ఐ అమూల్య గైక్వాడలకు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ యాదవ్ సర్పంచ్ ఎలిగేటి తిరుపతికి పుష్పగుచ్చం అందించి..శాలువాతో సత్క రించారు. అనంతరం గ్రామంలోని శాంతి భద్రతలపై ఇరువురు చర్చించుకున్నారు. పోలీస్ శాఖకు గ్రామ పంచాయతీ తరపున ఎల్లవేళలా సహకారం అందిస్తామని సర్పంచ్ తిరుపతి ఈ సందర్భంగా సీఐకి తెలిపారు.




## టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు ఘనస్వాగతం పలికిన బోనగాని యాదగిరి గౌడ్

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జూన్ 22,**

టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా హన్మకొండలోని హంటర్ రోడ్డులో గల డి కన్వెన్షన్ హాల్ లో జరిగిన బూత్ కమిటీ లెవెల్ సమావేశానికి హాజరైనారు. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్ నేతృత్వంలో 50 మంది గౌడ సంఘం కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బోనగాని యాదగిరి గౌడ్ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లకు పుష్పగుచ్చం అందించి..శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ మీనాక్షి నటరాజన్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవళి రెడ్డి, మాజీ కార్పొరేటర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్యంతో కూడిన ప్రణాళికలు రూపొందించి ఉత్తమ ఫలితాలు సాధించాలి

- రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్
- జిల్లాలోని పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇళ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ప్రత్యేక కార్యదర్శి..



**చొప్పదండి ప్రతినిధి, జూన్ 22, :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం అమలుపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి సోమవారం జగిత్యాల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై జిల్లా విద్యాశాఖాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన రాబోయే పరీక్షల కోసం ఇప్పటి నుంచే లక్ష్యంతో కూడిన ప్రణాళిక రూపొందించుకుని కష్టపడి చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టుదలతో శ్రమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు పూర్తిగా అందాయా అని ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు, కోడిగుడ్ల సరఫరా, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, బోధన నిర్వహణపై ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్న ఆమె, గత సంవత్సర ఎస్ఎస్సి ఫలితాలపై జిల్లా విద్యాశాఖాధికారి నుండి సమాచారం సేకరించారు. అనంతరం పాఠశాలలోని డైనింగ్ హాల్, మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించారు. ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తూ ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహణ చేపట్టాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో కిచెన్ గార్డెన్ను సక్రమంగా నిర్వహించాలని సూచించిన ఆమె, మధ్యాహ్న భోజన పథక నిర్వహణలో ఎల్పీజీ గ్యాస్ వినియోగంపై కూడా వివరాలు తెలుసుకున్నారు. చివరగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యను జీవితం లో అత్యంత విలువైన సంపదగా భావించి క్రమశిక్షణ తో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌తో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ఆరోగ్య కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు కొనసాగించాలని సూచించారు. తదుపరి మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న, పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణ పురోగతి, ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం గురించి వివరాలు తెలుసుకున్నారు. పూర్తయిన ఇళ్లను సందర్శించి పరిశీలించి, ఇళ్లు ఎంతో నాణ్యంగా, ఆకర్షణీయంగా నిర్మించబడి నట్లు అభినందించారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను కూడా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు గడ్డం జీవన్ రెడ్డి, కడారి మల్లేశం, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము, డిపిఓ మదన్మోహన్, జిల్లా వైద్యాధికారి జి. సుజాత, ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఉప సర్పంచ్ గుర్రం నర్సయ్య, తహసీల్దార్లు డి. నరేష్, శ్రీనివాస్, ఎంపీడీఓలు ఈ. స్వరూప, స్వాతి, ఎంఈఓ శ్రీనివాస్, మండల వైద్యాధికారులు (డిడిఓ) డాక్టర్ నరేష్, డాక్టర్ పరమేశ్వరి, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్, ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలసదనం ఆకస్మిక తనిఖీ

**జిల్లా కలెక్టర్ హైమావతి**

**సిద్ధిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 22, :**

జిల్లా కేంద్రంలోని బాలసదనాన్ని సోమవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బాలసదనంలోని పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కలెక్టర్ క్యాంపు కార్యాలయ ప్రాంగణంలోని మామిడి చెట్లకు కాసిన మామిడి పండ్లను పిల్లలకు పంపిణీ చేశారు. పిల్లలను పలకరించిన కలెక్టర్, భోజనం ఎలా పెడుతున్నారో, పాఠశాలకు క్రమం తప్పకుండా వెళ్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆహారం బాగా అందిస్తున్నారని, ప్రతిరోజూ పాఠశాలకు వెళ్తున్నామని పిల్లలు తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మంచి అలవాట్లు అలవర్చుకోవడంతో పాటు క్రమశిక్షణతో, ధైర్యంగా ఉండాలని చెప్పారు. ప్రతిరోజూ యోగా, ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని పిల్లలకు సూచించారు. బాలసదనంలో మెనూ ప్రకారం రుచికరమైన, పోషకాహారాన్ని అందించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బాలసదనం పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి శారదకు సూచించారు.



# కష్టమర్లకు అండగా సిటిజన్ ది కో-ఆపరేటివ్ సొసైటీ సేవలు

- జగద్గిరిగుట్ట బ్రాంచ్ మేనేజర్ తాతాజీ..
- రూ.3.లక్షల చెక్కు మృతుడి భార్యకు అందజేత..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 22, :**

కస్టమర్లకు అండగా ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ నిరంతరం సేవలందిస్తుందని బ్రాంచ్ మేనేజర్ తాతాజీ పేర్కొన్నారు. ఇటీవలే తమ బ్యాంకు కస్టమర్ రంగారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన యామల బాబురావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పేద కుటుంబమైన వారికి బ్యాంకు ద్వారా మంజూరైన ప్రమాద భీమా రూ.3 లక్షల చెక్కును సోమవారం బ్యాంక్ కార్యాలయంలో మృతుడి భార్య యామల లక్ష్మి కి జగద్గిరిగుట్ట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్త తో కలిసి అయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన తమ సిటిజన్ సొసైటీ బ్యాంకు ద్వారా పలువురికి ప్రమాద బీమాలు అందజేయడంతో పాటు పది, ఇంటర్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికాలను రూపేన అందజేశామని పేర్కొన్నారు. భవిష్యత్ లో సేవలు విస్తృతం చేస్తామని తెలిపారు. సంఘ సేవకులు ఉప్పల రమేష్ గుప్తా మాట్లాడుతూ కస్టమర్లకు మెరుగైన సేవలు అందిస్తున్న బ్యాంక్ యాజమాన్యానికి, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, వైశ్య సంఘం నాయకులు గజ్జి ఉపేందర్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.




# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ధర్మపురి ప్రతినిధి, జూన్ 22, :**

ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి ప్రజల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 68 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు, 9 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు సేవ చేయడం తన ప్రధాన బాధ్యత అని అన్నారు. పేద ప్రజల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబం కలగంటున్న సొంతింటి స్వప్నాన్ని సాకారం చేయడమే తన లక్ష్యమని, అందులో భాగంగా అర్హులైన నిరుపేదలకు జూలై నెల నాటికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాల కోసం పెగడపల్లి మండలానికి రూ.2.51 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులతో గ్రామాల మధ్య రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని, రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చేసి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సాగునీటి వసతుల విస్తరణతో పెగడపల్లి మండలాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# రైతులకు సువర్ణావకాశం.. నేటి నుంచి విత్తన మేళా..

- దుబ్బాక, చీకోడ్ రైతు వేదికలలో ప్రారంభం
- ఒకే చోట అందుబాటులో నాణ్యమైన వరి విత్తనాలు

**దుబ్బాక ప్రతినిధి, జూన్ 22, :**

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం, అధిక దిగుబడులు సాధించేందుకు తోడ్పాటు అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని సోమవారం వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 23 నుంచి జూన్ 30, 2026 వరకు జిల్లాలోని అన్ని రైతు వేదికలలో విత్తన మేళాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 23న దుబ్బాక రైతు వేదికతో పాటు చీకోడ్ రైతు వేదికలో విత్తన మేళాను ప్రారంభించనున్నారు. ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచనున్నారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే సౌకర్యం కల్పించబడింది. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతలను ప్రోత్సహిస్తూ అధిక దిగుబడులు సాధించే వంగడాలను రైతులకు చేరువ చేయడంలో ఈ విత్తన మేళా కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు పేర్కొన్నారు. కావున మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళాలో పాల్గొని తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోరింది.



# గీతంలో ఉత్సాహభరితంగా యోగా దినోత్సవం

- ఆనందంగా పాల్గొన్న గీతం ఉన్నతాధికారులు, సిబ్బంది, విద్యార్థులు

**పటాన్చెరు, జూన్ 22, :**

ఆరోగ్యం, శ్రేయస్సుకు యోగాను ఒక సంపూర్ణ విధానంగా ప్రోత్సహించేందుకు, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని క్రీడా విభాగం సోమవారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహభరితంగా జరుపుకుంది. ప్రాంగణంలోని అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను గాంధీ స్క్వేర్ లో ఒకచోట చేర్చి యోగ సాధన చేయించారు.అన్ని వయస్సుల వారిలో శారీరక శక్తి, మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యత, ఆరోగ్యకరమైన దీర్ఘాయువును ప్రోత్సహించడంలో యోగా పాత్రను నొక్కి చెప్పే ఈ ఏడాది విశ్వవ్యాప్త ఇతివృత్తం 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా'కు అనుగుణంగా ఈ వేడుకను నిర్వహించారు.శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగాభ్యాసాల ప్రాముఖ్యత, వాటి ప్రాధాన్యతపై పరిచయంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. దీని తరువాత, భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచించిన కామన్ యోగా ప్రోటోకాల్ కు అనుగుణంగా యోగాసనాలు, కపాలభాతి, ప్రాణాయామం, ధ్యానంతో కూడిన మార్గదర్శక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ యోగ సాధనలో అంతా చురుకుగా పాల్గొని, యోగా యొక్క శాస్త్రీయ ప్రయోజనాలపై విలువైన అవగాహన పొందారు. క్రమం తప్పని యోగా సాధన చురుకైన జీవనశైలికి, ఒత్తిడి నియంత్రణకు, వ్యాధుల నివారణకు, సంపూర్ణ శ్రేయస్సుకు ఎలా దోహదపడుతుందో శిక్షకుడు వివరించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తో పాటు పలువురు విభాగాధిపతులు హాజరయ్యారు. వీరంతా ఆరోగ్యకరమైన, మరింత సమతుల్యమైన జీవనశైలి కోసం ఈ ప్రాచీన క్రమశిక్షణను స్వీకరించడానికి అందరితో కలిసి సాధన చేశారు.ఈ వేడుకలలో భాగంగా, పాల్గొన్న వారందరికీ టీ–షర్టులు పంపిణీ చేశారు. హాజరైన వారందరిలో ఐక్యత, శ్రేయస్సు, సామూహిక స్ఫూర్తిని పెంపొందిస్తూ, సామూహిక ఫోటో సెషన్ తో పాటు, రుచికరమైన అల్పాహారంతో ఈ కార్యక్రమం ముగిసింది.



చురకలు



# ఇందిరమ్మ ఇళ్లతో శాశ్వత నివాసాలు

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

**మానకొండూర్ ప్రతినిధి, జూన్ 22, :**
సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా శాశ్వత నివాసాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. సోమవారం బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు గృహ సదుపాయం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలు శాశ్వత నివాసాలు పొందే అవకాశం కలుగుతుందని చెప్పారు. పేద ప్రజలకు గృహ సదుపాయం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో ఎన్నో కుటుంబాలు సొంత ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వారికి శాశ్వత నివాస సౌకర్యం కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని, లబ్ధిదారులు మంజూరు అయిన ఇళ్లను త్వరితగతిన నిర్మించుకుని కుటుంబాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన గృహ నిర్మాణం చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పేదల గృహ అవసరాల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజల



జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, అర్హులైన ఒక్క లబ్ధిదారుడు కూడా నష్టపోకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి ఎంపిడిఓ కె.ప్రవీణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గ దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, ఎఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ రైతు బాంధవుడు

**కుకునూరుపల్లి, జూన్ 22, :**
పీఎం కిసాన్ 23వ విడత నిధులను దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరికీ ఏకకాలంలో విడుదల చేయడంపై సోమవారం కుకునూరుపల్లి మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. విపత్కర పరిస్థితుల్లోనూ, రైతులు విత్తనాలు వేసుకునే సమయానికి ఈ పెట్టుబడి సాయాన్ని అందించి ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి "రైతు బాంధవుడు" అని నిరూపించుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ కోరే సంతోష్, మండల సీనియర్ నాయకులు సదానంద్ గౌడ్, రెడ్డమైన లింగం, రెడ్డమైన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన



## సర్పంచ్ బూడిద రమేష్ గౌడ్

**కుకునూరుపల్లి, జూన్ 22, :**
ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని రాయవరం సర్పంచ్ బూడిద రమేష్ గౌడ్ అన్నారు. కుకునూరుపల్లి మండలం రాయవరం ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ బుడిద రమేష్ గౌడ్ హాజరై విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల విధ్యాధికారి బచ్చలి సత్యయ్య, పాఠశాల ప్రధానోఫాద్యాయురాలు మంజుల తదితరులు ఉన్నారు.

# మక్తకుంట చెరువును ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవు

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 22, :**
తెల్లాపూర్ డివిజన్‌లోని సందుగూడెం పరిధిలో ఉన్న మక్తకుంట చెరువును ఆక్రమించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు.సోమవారం సాయంత్రం నీటిపారుదల శాఖ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే మక్తకుంట చెరువును పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొందరు వ్యక్తులు శిఖం భూమి పేరుతో చెరువులో మట్టిని నింపుతూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తానే స్వయంగా క్షేత్రస్థాయిలో



పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు.గ్రామానికి అనుసంధానంగా ఉన్న చెరువు కట్ట రహదారిని ధ్వంసం చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. దశాబ్దాలుగా గ్రామస్తులు ఇదే మార్గంలో అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు.శిఖం పట్టా భూమిలో వ్యవసాయం చేసుకోవచ్చని, అయితే చెరువులో మట్టిని నింపి ఆక్రమణలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. చెరువులో గజం భూమిని కూడా కబ్జా చేయడానికి ఎవరినీ అనుమతించబోమని హెచ్చరించారు.నీటిపారుదల శాఖ ఈఈ భీమ్‌కు రెండు రోజుల్లో చెరువు కట్టను పునరుద్ధరించడంతో పాటు ఆక్రమణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, ఏఈ జ్యోతి, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, కొమరయ్య, సీనియర్ నాయకులు రమేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను వేధించిన ప్రధానోపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేయాలి

## ఎస్ఎఫ్ఐ

**పటాన్‌చెరు, జూన్ 22, :**
ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రశ్నించిన విద్యార్థులను వేధింపులకు గురిచేస్తూ, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఇస్నాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అర్జున్ డిమాండ్ చేశారు.సోమవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాలలో ఉన్న సమస్యలు, ప్రధానోపాధ్యాయురాలి వేధింపులపై ఎస్ఎఫ్ఐ నాయకులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, సమస్యల గురించి ప్రశ్నిస్తే ప్రధానోపాధ్యాయురాలు అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు, ప్రశ్నించిన వారికి టీసీ ఇచ్చి పాఠశాల నుంచి పంపిస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల సమస్యలను తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టి, మండల విద్యాశాఖ అధికారిని వెంటనే పాఠశాలకు రావాలని డిమాండ్ చేశారు.ఆందోళన విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న సమస్యలన్నింటినీ వారం రోజుల్లో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అర్జున్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఎస్ఎఫ్ఐ అండగా ఉంటుందని



తెలిపారు. విద్యార్థుల పట్ల అమానుషంగా, అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయురాలిపై కఠిన చర్యలు తీసుకుని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్, విద్యార్థి నాయకులు శ్రావణి, ప్రేమ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధికి ఎమ్మెల్యే 2 కోట్ల నిధులు మంజూరు

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల పాలాభిషేకం..

**చొప్పదండి/కొడిమ్యాల, జూన్ 22, :**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనుల నిమిత్తం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం 2 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కృతజ్ఞతగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకి మండల ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోగురి నాగభూషణ్ రెడ్డి, ఏఎంసి వైస్ ఛైర్మన్, కొండూరి రాజేష్, గ్రామ సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్, నాయకులు గుడి మల్లికార్జున్ రెడ్డి, చిలువేరి నారాయణ, సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, ముత్యం రెడ్డి, కంబల్ల రాజమల్లు, అజయ్ రెడ్డి, నేరెళ్ళ మహేష్, పర్లపల్లి ప్రసాద్, సింగిరెడ్డి వినోద్ రెడ్డి, నజీర్, ప్రసాద్, మల్లారపు రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారుల కు న్యాయం జరగాలి

- ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి
- టిఆర్ఎస్ జిహెచ్ఎంసి ఉద్యమకారుల ఇంచార్జ్ నరేష్..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 22, :**
జులై 2వ తేదీన తెలంగాణా రక్షణ సేన వ్యవస్థపాక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు జరిగే తెలంగాణ ఉద్యమకారుల భూ పోరాటానికి కత్బుల్లాపూర్ ఉద్యమకారులు భారీగా తరలి రావాలని సోమవారం టిఆర్ఎస్ జిహెచ్ఎంసి ఉద్యమకారుల ఇంచార్జ్ నరేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అబద్దపు హామీలు ఇచ్చి గద్దే నెక్కిన



కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీ ల పేరుతో కాలయాపన చేస్తూ ఉద్యమకారులను విస్మరిస్తున్న విషయం అందరకి తెలిసిందే, తెలంగాణ వాదం లేదని భావిస్తున్న ఆంధ్ర పాలకుల చేతిలో కీలు బొమ్మల మారిన కాంగ్రెస్ ప్రభుత్వం నోర్లు మూతపడేలా మరో మిలియన్ మార్చ్ ని తలపించేలా ఉప్పల్ బాగాయత్ లో జరిగే భూపోరాటం విజయవంతం చేసి ఉద్యమకారుల ఆకాంక్షను నిలబెడుదాం. అమరవీరుల ఆత్మకు శాంతిని చేకూరుద్దామని జిహెచ్ఎంసి తెలంగాణ ఉద్యమకారుల భూపోరాటం కార్యక్రమం ఇంచార్జి నరేష్ ప్రజాపతి అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశం లో నియోజకవర్గం బాధ్యులు ఎత్తారి మారయ్య, పడాల మనోజ గౌడ్ పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలొ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, మల్లారి అనిల్ కుమార్ , రామగిరి ప్రకాష్ , బీరకాయల మధుసూదన్, రాజలింగం, సంధ్యారెడ్డి, శీలం వీరేందర్, సీతారాం, నవీన్ , రామ్ కోటి , కొప్పుల అర్జున్, బెంజమిన్, శ్రీనివాస్ యాదవ్, సోనీ దేవి, రాజు, సమీర్ మరియు ఇతర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయం ఎదుట భూములు కోల్పోతున్న దళిత రైతుల ధర్నా

- ఎమ్మార్పీఎస్ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కువినతి పత్రం
- దళిత రైతులకు ప్రభుత్వం అన్యాయం చేయొద్దు
- మైసగళ్ళ బుచ్చేంద్ర మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22, :**
పటాన్చెరు మండలం లక్డారం గ్రామంలో సర్వేనెంబర్ 498లో 22 ఎకరాలు దళిత రైతుల అసైన్డ్ భూములు ప్రభుత్వం తీసుకోవద్దని సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అలాగే జిల్లా కలెక్టర్ కి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా దళిత రైతులు అసైన్డ్ భూముల్లో పంటలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని వారికి వేరే జీవనాధారం లేనందున ఇట్టి భూములను సాగు చేసుకుని జీవిస్తున్నారని, దళిత రైతుల జీవనాధారం లేకుండా ప్రభుత్వము తీసుకోవడం రైతులను నట్టేట ముంచడమేనన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ దళితులనే టార్గెట్ చేసి దళితుల అసైన్డ్ భూములు లాక్కోవడము దళితులపైన



ప్రభుత్వానికి వివక్షత ఉందని భావిస్తున్నామన్నారు. దళితుల అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే దళితుల భూములు లాక్కోవడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం దళితుల పక్షాన న్యాయం చేయాలని వారికి పట్టా పాస్ బుక్ లు ఇచ్చి నేమ్ చేయాలని ప్రభుత్వాన్ని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటోల వెంకటేష్ మాదిగ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు, కేసారం నటరాజ్ మాదిగ ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి,బండ రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జీవన్ మాదిగ మల్లేష్, భూములు కోల్పోతున్న రైతులు మహిళలు పాల్గొన్నారు.

# డిఈఓ కార్యాలయం ముందు బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ధర్నా



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22, :**
సంగారెడ్డి జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలు అధికారులతో కుమ్మక్కై ఇస్తానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థి విభాగం అఖిల్ తెలిపారు. ఇలాంటి వసూళ్లకు పాల్పడుతున్న అటువంటి ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు సంగారెడ్డి జిల్లా డిఈఓ ప్రైవేటు పాఠశాలలకు తొత్తులుగా మారారని ఇలాంటి అప్పుడు అధిక ఫీజులు ఎందుకు వసూలు చేస్తారని వారు ప్రశ్నించారు. బస్సులు కూడా ఫిట్నెస్ లేనటువంటి బస్సులను నడుపుతున్న ఏ అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, రాజేందర్ నాయక్, అఖిల్, అక్షయ్, లక్ష్మణ్, నజీర్ పాల్గొన్నారు.

## విత్తన మేళాలో ప్రభుత్వం సూచించిన వరి విత్తనాలను కొనాలి

**తూప్రాన్, జూన్ 22, :**
ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ నెల 23 నుండి 30 వరకు నర్సాపూర్ డివిజన్లోని పది రైతువేదికలలో విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సంధ్యారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ప్రభుత్వం సూచించిన వరి రకాలను మాత్రమే వేయాలని వాటిని మాత్రమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల బీపీటీ 5204 (సాంబ మసూరి), ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం 1638, 7715, వరంగల్ 44 (సిద్ది), హెచ్ఎంటి, జైశ్రీరామ్ 7 వరి విత్తనాలను మాత్రమే రైతులు పంటను వెయ్యాలని తెలిపారు. రైతు వేదికలలో వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయని, తీసుకోవచ్చని తెలిపారు. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పిస్తుందని, కావున రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, విత్తన మేళాలో పాల్గొని తమకు కావలసిన విత్తనాలను కొనుగోలు చేసుకోవలసిందిగా కోరారు.




## కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై హన్మంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన మైనార్టీ మహిళలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 22, :**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న ఇందిరా మహిళా శక్తి సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కైసర్ నగర్‌కు చెందిన మైనారిటీ మహిళలు ఫరీన్ ఖాన్ ఆధ్వర్యంలో, బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా పార్టీ కండువా వేసుకొని కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల భాగస్వామ్యం సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, స్వయం సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. మహిళలకు సామాజిక, ఆర్థికంగా మరింత బలోపేతం కలిగించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన మహిళలకు స్వాగతం పలుకుతూ, ప్రజాసేవలో చురుకుగా పాల్గొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన సర్పంచ్ అనంతరెడ్డి



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22, :**
సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ పడమటి అనంతరెడ్డి ఆధ్వర్యంలో 1 నుంచి 7 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సోమవారం గ్రామ సర్పంచ్ అనంతరెడ్డి ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని విద్యార్థులు విద్యార్థినిలకు అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు గుంతపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏ వసతులైన కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలియజేశారు. టీచర్ల వసతి, విద్యార్థులు సకాలంలో పాఠశాలకు వెళుతూ మెరుగైన విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్యఆరోగ్య శాఖ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డిప్రతినిధి, జూన్ 22, :**



జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతి జైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించడంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నూతన కార్యాలయం ద్వారా శాఖ కార్యకలాపాల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి లలిత దేవి, కార్యాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కంపెనీ అభివృద్ధే కార్మికుల అభివృద్ధి

- **ఎమ్మెల్యే తాటికొండ వెంకటరమణారెడ్డి**

**తూప్రాన్, జూన్ 22, :**
మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి లోని టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టీసీఎల్) టాటా కాఫీ కంపెనీ కార్మిక సంఘం నూతన అధ్యక్షుడిగా కామారెడ్డి ఎమ్మెల్యే టిసిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా తాటికొండ వెంకటరమణారెడ్డినీ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సోమవారం ఎంప్లాయిస్ యూనియన్, మేనేజ్మెంట్ ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామారెడ్డి ఎమ్మెల్యే, టీసీఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ తాటికొండ వెంకటరమణారెడ్డి కంపెనీ గెట్ ముందు బీఎంఎస్ జెండాను ఆవిష్కరించి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబంలో భార్యాభర్తలు పరస్పర సహకారంతో ముందుకు సాగినట్లే కంపెనీ యాజమాన్యం, కార్మికులు కూడా ఐక్యంగా పనిచేస్తే సంస్థ అభివృద్ధి చెందడంతో పాటు కార్మికుల జీవితాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. కంపెనీ బాగుంటేనే కార్మికుల సంక్షేమం సాధ్యమవుతుందని, చిన్న చిన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కంపెనీ అభివృద్ధి, కార్మికుల



ఎదుగుదల ఒకదానికొకటి విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. యాజమాన్యం, కార్మికులు పరస్పరం లాగుడుదీతలకు దిగితే సమస్యలు జటిలమై ఇరువర్గాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కార్మిక నాయకుడిగా, యూనియన్ అధ్యక్షుడిగా కార్మికుల సమస్యల పరిష్కారంలో సమర్థవంతమైన మధ్యవర్తిత్వం నిర్వహించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో అవినీతికి తాను పూర్తిగా వ్యతిరేకమని, ప్రజల డబ్బును దుర్వినియోగం చేసే వారిని సహించనని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసంతో గత, ప్రస్తుత ముఖ్యమంత్రులపై విజయం సాధించిన ఎమ్మెల్యేగా తన బాధ్యతను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానని చెప్పారు. అవసర సమయంలో అండగా నిలబడటమే నిజమైన సేవ అని, కష్టకాలంలో ఇచ్చే ధైర్యం ఎన్నో కుటుంబాలకు బలాన్నిస్తుందని పేర్కొన్నారు. కార్మికునికి న్యాయం జరిగితే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, తాను పదవిని ఆడంబరంగా, అలంకారంగా కాకుండా బాధ్యతగా భావించే వ్యక్తినని తెలిపారు. టీసీఎల్ మేనేజ్మెంట్, కార్మికులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతున్నందున సంస్థ మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక ఉద్యోగంపై అతని కుటుంబంలోని నల్గురు సభ్యుల జీవితం ఆధారపడి ఉంటుందని, అందుకే ప్రతి ఉద్యోగి సంక్షేమం సంస్థ పురోగతితో ముడిపడి ఉందన్నారు. ట్రేడ్ యూనియన్ వ్యవహారాలు తనకు కొత్త అయినప్పటికీ కేవలం రెండు నెలల్లోనే యూనియన్ చట్టాలు, నిబంధనలను అధ్యయనం చేసి కార్మికులు, యాజమాన్యం మధ్య వారధిగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. సంస్థలోని ప్రతి సమస్యను చర్చల ద్వారా పరిష్కరించి కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీసీఎల్ కార్మిక సంఘానికి నూతన నాయకత్వం లభించడం సంస్థలో కార్మిక–యాజమాన్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, కార్మిక సంక్షేమంతో పాటు పరిశ్రమ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని పాల్గొన్నవారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీసీఎల్ సైట్ హెడ్ శివకుమార్, హెచ్ఆర్ కోటేశ్వర రావు, క్వాలిటీ ఆఫీసర్ రాకేష్, ప్రొడక్షన్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, మెయింటెనెన్స్ ఇన్‌చార్జి రంగనాయకులు, బీజేపీ రాష్ట్ర నాయకులు గిరీష్ రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి వర్గంటి రామ్‌మోహన్ గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్, మండల అధ్యక్షులు పిట్ల పోచయ్య ముదిరాజ్, పడాలపల్లి కౌన్సిలర్ సత్యనారాయణ, సంఖ్య యాదగిరి, రఘువీరారెడ్డి, వెంకట నాగేంద్ర గౌడ్, జక్కిడి నరేందర్ రెడ్డి (బుల్లెట్ రాజు), యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్లు నర్సింగ్‌రావు, రఘుపతి రెడ్డి, జనరల్ సెక్రటరీ లంబ లవకుమార్ యాదవ్, జాయింట్ సెక్రటరీలు బొంది శ్రీనివాస్ గౌడ్, వీరప్రసన్న, ట్రెజరర్ వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ప్రవీణ్, సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లు దైవాదీనం, మహేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు రామశర్మ, కార్మిక నాయకులు, మహిళా కార్మికులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతం హర్షం

- **జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక అధికారి అభినందనలు**

**సిద్ధిపేట కలెక్టరేట్, జూన్ 22, :**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా అమలు చేసినందుకు జిల్లా అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి అహ్మద్ నదీమ్ అభినందించారు. సోమవారం సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక అధికారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి 16 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటో ప్రదర్శనను ఆయన పరిశీలించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసిన జిల్లా కలెక్టర్ కట్టా హైమావతిని ప్రత్యేకంగా అహ్మద్ నదీమ్ అభినందించారు. జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు.సమీక్షా సమావేశంలో వైద్య, వ్యవసాయ, విద్య, గ్రామీణాభివృద్ధి, పోలీస్, ఐసిడీఎస్, ఫుడ్ సేఫ్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా వివరించారు. కార్యక్రమం అమలులో ఎదురైన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ప్రత్యేక అధికారి ఆరా తీశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలును పర్యవేక్షిస్తున్నట్లు అహ్మద్ నదీమ్ తెలిపారు. జిల్లాలో గ్రామ, వార్డు, మండల సభల ద్వారా సుమారు 19 వేల ఫిర్యాదులు స్వీకరించగా, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా వ్యవహరించాలని, స్థానికంగా పరిష్కరించగల అంశాలను వెంటనే పరిష్కరించి, ఉన్నతస్థాయి జోక్యం అవసరమైన సమస్యలను సంబంధిత శాఖలకు పంపాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం జరిగితే ప్రభుత్వంపై ప్రజల్లో అపోహలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో అందిన దరఖాస్తుల్లో అధిక భాగం సామాజిక పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినవేనని, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే వానాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ శాఖల పురోగతి, పెండింగ్ సమస్యలు, విజయ గాథలతో కూడిన సమగ్ర బుక్‌లెట్ సిద్ధం చేయాలని, ఉత్తమ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. 99 రోజుల కార్యక్రమానికి సంబంధించిన



పూర్తి డాక్యుమెంటేషన్ రూపొందించి, విజయాలతో పాటు ఎదురైన సవాళ్లు, వాటి పరిష్కార చర్యలను నమోదు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, ప్రత్యేక అధికారి సూచనల మేరకు పెండింగ్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. పింఛన్ల దరఖాస్తుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చేపడతామని పేర్కొన్నారు.సమావేశం ముగింపులో ప్రత్యేక అధికారి అహ్మద్ నదీమ్ “నషా ముక్త్ భారత్” పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆయనను చేర్యాల చిత్రపటంతో సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి, సీపీఓ, అదనపు డీసీపీ, ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- **యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22, :**
మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా వ్యవహరించాలని, ముఖ్యంగా యువత డ్రగ్స్ ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న “నషా ముక్త్ భారత్ సప్తాహ్” కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్ “నషా ముక్త్ భారత్ అభియాన్ వికసిత్ భారత్ కి పహచాన్” పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ



సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ అభివృద్ధికి కూడా తీవ్ర ముప్పుగా మారుతుందని అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ 17 నుండి జూన్ 26 వరకు నిర్వహిస్తున్న “నషా ముక్త్ భారత్ సప్తాహ్–2026” ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి సకాలంలో సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 14446 నేషనల్ డీ–అడిక్షన్ హెల్ప్‌లైన్ సేవలను అందుబాటులో ఉంచిందని, అవసరమైన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, డీఆర్‌డీఓ జ్యోతి, జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22, :**
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ప్రతి ఫిర్యాదును సత్వరంగా పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోపు చర్యలు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల వివరాలను తెలుసుకుని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు వినతులను పంపిస్తూ తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజావాణిలో మహిళా, శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ శాఖ, కార్మిక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), వైద్య ఆరోగ్య శాఖ, ఇంటర్మీడియట్, వైద్య ఆరోగ్య, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ శాఖ, డీఆర్‌డీఓ తదితర శాఖలకు సంబంధించిన వినతులు అందాయి. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 57 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో జిల్లా కలెక్టరేట్‌లో 34, సంగారెడ్డి డివిజన్‌లో 12, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్ డివిజన్‌లో 1, జహీరాబాద్



డివిజన్‌లో 10 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మహాకవి శ్రీశ్రీని తీర్చిదిద్దిన సద్విమర్శకుడు

### తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయుడు కొంపెల్ల జనార్దనరావు

## నేడు కొంపెల్ల జనార్ధనరావు వర్ధంతి

**తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, సామాన్యుడి కష్టనష్టాలను కవిత్వంగా మలచిన మహాకవి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) పేరు వినని తెలుగువాడుండడు. ప్రాచీన గ్రంథాలకే పరిమితమైన కవిత్వాన్ని జన బాహుళ్యంలోకి తెచ్చిన ఘనత ఆయనదే. ముఖ్యంగా 1950లో ప్రచురితమైన ఆయన 'మహాప్రస్థానం' కవితా సంపుటి తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. అయితే, శ్రీశ్రీని ఒక మహాకవిగా తీర్చిదిద్దడంలో, ఆయనకు సరికొత్త మార్గనిర్దేశనం చేయడంలో కొంపెల్ల జనార్ధనరావు పోషించిన పాత్ర చాలామందికి తెలియని ఒక ఒక అద్భుతమైన అధ్యాయం. 1928లో శ్రీశ్రీ రచించిన తొలి కావ్యం 'ప్రభవ'ను కొంపెల్ల సమీక్షిస్తూ, అందులో సుదీర్ఘ సమాసాలు తగ్గించాలని, సంస్కృతానుకరణ వద్దని పదునైన విమర్శ చేశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణల ప్రభావంలో ఉన్న శ్రీశ్రీలో సొంత గొంతుకను వెతుక్కునేలా చేసింది కొంపెల్ల చేసిన ఆ సద్విమర్శే. ఆ విమర్శల నేపథ్యమే ఆ తర్వాత వారిద్దరి మధ్య ఒక బలమైన, విడిపోని ఆప్తమిత్రత్వాన్ని నిర్మించింది.**

తెలుగు సాహిత్య చరిత్రలో కొందరు రచయితలు తమ రచనలతో చిరస్థాయిగా నిలిచిపోతే, మరికొందరు ఇతర మహానుభావుల ప్రతిభను గుర్తించి వారికి దిశానిర్దేశం చేసిన మార్గదర్శకులుగా చరిత్రలో నిలిచిపోతారు. అలాంటి అరుదైన సాహితీవేత్తల్లో కొంపెల్ల జనార్ధనరావు ఒకరు. భావకవి, విమర్శకుడు, సంపాదకుడు, నాటక రచయితగా తెలుగు సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవలు విశేషమైనవి. తెలుగు సాహిత్యాన్ని కొత్త దిశలో నడిపించిన మహాకవి శ్రీశ్రీ జీవితంలో కొంపెల్ల జనార్ధనరావు పాత్ర అత్యంత కీలకమైనది. 1928లో శ్రీశ్రీ రచించిన 'ప్రభవ' కావ్యాన్ని సమీక్షించిన కొంపెల్ల, అందులోని సంస్కృత సమాసాల అధిక వినియోగాన్ని, అనుకరణ ధోరణిని నిర్భయంగా విమర్శించారు. ఆ విమర్శలే శ్రీశ్రీలో కొత్త ఆలోచనలకు నాంది పలికాయి. తనదైన స్వరాన్ని వెతుక్కోవాలన్న తపనను బలపరిచాయి. విమర్శలతో ప్రారంభమైన వారి పరిచయం జీవితాంతం నిలిచిన స్నేహంగా మారింది.

1907లో తూర్పుగోదావరి జిల్లా మోడేకుర్రులో జన్మించిన కొంపెల్ల చిన్న వయస్సులోనే అసాధారణ సాహిత్య పాండిత్యాన్ని సంపాదించారు. యూరోపియన్ సాహిత్యాన్ని అధ్యయనం చేసి విశాల దృక్పథాన్ని అలవర్చుకున్నారు. ఇరవై ఏళ్ల వయస్సులోనే ప్రముఖ సాహిత్య పత్రిక 'భారతి'లో ఉపసంపాదకుడిగా చేరి తన ప్రతిభను చాటుకున్నారు.

సాహిత్యంలో రాజీపడని విమర్శకుడిగా కొంపెల్ల పేరు పొందారు. ఎంతటి ప్రసిద్ధ రచయిత అయినా, ఎంతటి ప్రముఖ కళాకారుడైనా తన అభిప్రాయాన్ని నిర్భయంగా వెల్లడించేవారు. సాహిత్యంలో నాణ్యత, కొత్తదనం, భావప్రకటనకు ఆయన అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు. 1934లో ఆయన ప్రారంభించిన 'ఉదయిని' ద్వైమాసిక సాహిత్య పత్రిక తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి, చలం, అడివి బాపిరాజు, రాయప్రోలు సుబ్బారావు, శ్రీశ్రీ వంటి ప్రముఖుల రచనలకు ఈ పత్రిక వేదికగా నిలిచింది. ముఖ్యంగా శ్రీశ్రీ రచించిన 'నేను సైతం' గీతాన్ని ప్రచురించడం ద్వారా నవ్య సాహిత్యానికి కొత్త ఊపిరి పోసింది. కొంపెల్లకు సాహిత్యం అంటే అపారమైన అభిమానం. సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే తపనతో ఆయన తన ఆరోగ్యం, ఆర్థిక స్థితి గురించి కూడా ఆలోచించలేదు. 'ఉదయిని' పత్రికను నిలబెట్టేందుకు అహర్నిశలు శ్రమించారు. అయితే ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం ఆయన ఆశయాలకు అడ్డంకిగా మారాయి.

క్షయవ్యాధితో బాధపడుతూ తీవ్ర దారిద్ర్యంలో 1937 జూన్ 23న ఆయన కన్నుమూశారు. వయస్సు కేవలం ముప్పై సంవత్సరాలే. కానీ ఆ స్వల్ప జీవితకాలంలోనే తెలుగు సాహిత్యంపై చెరగని ముద్ర వేశారు. తన ప్రియ మిత్రుడి మరణం శ్రీశ్రీని తీవ్రంగా కలిచివేసింది. అందుకే ఆయన తన అమర కావ్యం 'మహాప్రస్థానం'ను కొంపెల్ల జనార్ధనరావుకు అంకితం చేశారు. ఆ అంకిత పద్యాల్లో వ్యక్తమైన వేదన, మిత్రునిపై ఉన్న అపారమైన ప్రేమ, గౌరవం నేటికీ పాఠకులను కదిలిస్తూనే ఉన్నాయి. తెలుగు సాహిత్యంలో నవ్య భావజాలానికి, సాహిత్య విమర్శకు, సృజనాత్మక ఆలోచనలకు మార్గదర్శకుడిగా నిలిచిన కొంపెల్ల జనార్ధనరావు పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. మహాకవి శ్రీశ్రీ వెనుక నిలిచిన ఆ మహత్తర వ్యక్తిత్వాన్ని సాహిత్య లోకం ఎప్పటికీ మరువదు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# క్రీడల ద్వారా సమాజ వికాసం

## నేడు అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం

**అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 23న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ఇది క్రీడల ప్రాముఖ్యతను, శారీరక శ్రమ విలువను మరియు ఒలింపిక్ ఉద్యమ ఆదర్శాలను ప్రపంచ ప్రజలకు గుర్తు చేసే ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుంది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త పియర్ డి కుబెర్టిన్ ఆధ్వర్యంలో 1894లో ప్యారిస్‌లో జరిగిన ఒక ప్రత్యేక సదస్సులో ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ ఏర్పాటు చేయబడింది. ఆ చారిత్రాత్మక రోజును పురస్కరించుకుని 1948లో మొదటిసారిగా అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం నిర్వహించబడింది. అప్పటి నుండి ఈ ప్రత్యేక దినం ప్రపంచ దేశాలలోని కోట్లాది మంది ప్రజలను, యువతను క్రీడా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనడానికి ప్రేరేపిస్తోంది.**




ఈ అంతర్జాతీయ దినోత్సవం ప్రధానంగా మూడు ఆదర్శ లక్ష్యాలను ప్రపంచం ముందు ఉంచుతుంది. అందులో మొదటిది శారీరక చురుకుదనం (వీశీజవ), రెండోది క్రీడలపై అవగాహన పెంపొందించుకోవడం (ూముఖీఅ), మరియు మూడోది కొత్త క్రీడల అన్వేషణ (ణఅంఎశీజవతీ). వీటితో పాటు ఒలింపిక్ విలువలైన శ్రేష్ఠత (జుఞఎవశ్రీశ్రీవఅఎవ), స్నేహం (ఖీతీఱవఅంఛ్రఱజూ), గౌరవం (=వంజూవణ్‌) అనే మూడు సూత్రాలను విస్తృతంగా ప్రచారం చేయడం ఈ దినోత్సవ ప్రాథమిక ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జాతీయ ఒలింపిక్ సంఘాలు, విద్యా సంస్థలు, క్రీడా సంస్థలు మరియు ప్రభుత్వాలు ఉమ్మడి భాగస్వామ్యంతో ఈ రోజున రన్నింగ్, సైక్లింగ్, యోగా, ఫిట్‌నెస్ క్యాంపులు, క్రీడా పోటీలు, చర్చా సభలు మరియు ఒలింపిక్ చరిత్ర ప్రదర్శనలు వంటి విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తాయి. డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వేదికగా ఒలింపిక్ డే హ్యాష్‌ట్యాగ్‌ల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నారు.

ఒలింపిక్ క్రీడలు అనేవి కేవలం గెలుపు ఓటముల కోసమో, పతకాల కోసమో నిర్వహించేవి కావు. అవి మానవతా విలువల ఆవిష్కరణకు ఒక ఉత్కృష్టమైన మార్గం. ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య స్నేహ బంధాన్ని పెంపొందించడం, భిన్న సంస్కృతుల పట్ల పరస్పర గౌరవాన్ని చాటడం, శాంతియుత పోటీ భావనను పెంపొందించడం వంటి మహోన్నత భావాలు ఒలింపిక్ తత్వంలో నిగూఢంగా ఉన్నాయి. క్రీడల ద్వారా మానవ సమాజాన్ని ఐక్యంగా, ఆరోగ్యంగా మరియు చైతన్యవంతంగా తీర్చిదిద్దాలనే సందేశాన్ని ఈ దినోత్సవం ప్రపంచానికి చాటిచెబుతుంది.

ప్రపంచ క్రీడా యవనికపై భారతదేశం ఒలింపిక్స్‌లో తన తొలి అడుగును 1900 నాటి పారిస్ గేమ్స్‌లో వేసింది. ఆనాడు నోర్మన్ ప్రిట్చర్డ్ రెండు వెండి పతకాలు సాధించి దేశానికి తొలి ఒలింపిక్ విజేతగా నిలిచారు. ఆ తర్వాత 1928 నుండి 1956 వరకు భారత హాకీ జట్టు వరుసగా బంగారు పతకాలను కొల్లగొట్టి ప్రపంచ క్రీడా రంగంలో భారత ప్రతిష్టను శిఖరాగ్రాన నిలిపింది. లెజెండరీ హాకీ ప్లేయర్ మేజర్ ధ్యాన్ చంద్ హాకీ ఆటలో వేసిన పునాది చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయింది. ఆ తర్వాతి కాలంలో, 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో కర్ణం మల్లేశ్వరి వెయిట్‌లిఫ్టింగ్‌లో కాంస్యం సాధించి, ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన తొలి భారత మహిళగా సరికొత్త చరిత్ర సృష్టించారు. అలాగే 2008 బెయ్జింగ్ ఒలింపిక్స్‌లో అభినవ్ బింద్రా 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో స్వర్ణం సాధించి, వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం గెలిచిన తొలి భారతీయుడిగా రికార్డు నెలకొల్పారు.

టోక్యో 2020 ఒలింపిక్స్ భారత ఒలింపిక్ చరిత్రలోనే అత్యుత్తమ ఫలితాలను తీసుకువచ్చింది. యువ అథ్లెట్ నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో అద్భుత స్వర్ణ పతకంతో దేశ గౌరవాన్ని విశ్వవ్యాప్తం చేయగా, మీరాబాయి చాను వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకంతో భారత్‌కు అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. లవ్లినా బోర్గోహైన్ బాక్సింగ్‌లో కాంస్యాన్ని సాధించగా, భారత పురుషుల హాకీ జట్టు ఏకంగా 41 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుని పాత వైభవాన్ని గుర్తుచేసింది. ఇదే క్రమంలో స్టార్ షట్లర్ పీవీ సింధు వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన ఏకైక భారత మహిళగా సరికొత్త రికార్డు సృష్టించారు.

భారతదేశం ఒలింపిక్ క్రీడల చరిత్రలో 2024 నాటికి మొత్తం 35 పతకాలను తన ఖాతాలో వేసుకుంది. వీటిలో 10 బంగారు, 9 వెండి, 16 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇందులో భారత హాకీ జట్టు సాధించిన చారిత్రాత్మక బృంద విజయాలు కూడా భాగమై ఉన్నాయి. ఒలింపిక్స్‌లో భారత్ సాధించిన ప్రతి పతకం దేశంలోని క్రీడా పటిష్టతను పెంచడమే కాకుండా, కోట్ల మంది భారతీయ యువతలో కొత్త చైతన్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తించింది. ఈ విజయాల ద్వారా భారతదేశం కేవలం ఆర్థికంగానే కాకుండా, క్రీడారంగంలో కూడా ప్రపంచ దేశాల సరసన గౌరవనీయమైన స్థానాన్ని కలిగి ఉందని నిరూపించుకోగలిగింది.

అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం అనేది కేవలం ఒక రోజు జరుపుకునే వేడుక మాత్రమే కాదు. అది క్రీడల ద్వారా వ్యక్తిత్వ వికాసానికి, సమగ్ర సమాజాభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచే ఒక స్ఫూర్తిదాయకమైన రోజు. మానవ శరీరాన్ని దృఢంగా, మనస్సును సమతుల్యంగా మరియు యావత్ సమాజాన్ని ఐక్యంగా తీర్చిదిద్దే క్రీడా సంస్కృతికి ఇదే అసలైన మూలం. ఈ సుభదినాన ప్రతి ఒక్కరూ క్రీడలను మరియు శారీరక శ్రమను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి. ప్రపంచ శాంతిని, ఐక్యతను కాపాడే ఒలింపిక్ ఆదర్శాల పరిరక్షణలో తాము కూడా ఒక బాధ్యతాయుతమైన భాగస్వామి కావాలని ఈ సందర్భంగా ప్రతి పౌరుడూ సంకల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# సేవలో సమర్థత.. పాలనలో నైతికత

## నేడు ఐక్య రాజ్య సమితి ప్రజా సేవా దినోత్సవం

**ప్రపంచవ్యాప్తంగా ప్రజల మేలు కోసం ప్రభుత్వ యంత్రాంగాలు చేసే సేవలకు గౌరవం చెల్లించేందుకు, సేవా విధులలో నిబద్ధతతో పనిచేసే అధికారులను సత్కరించేందుకు ఐక్య రాజ్య సమితి ప్రతీ సంవత్సరం జూన్ 23వ తేదీని "ప్రజా సేవా దినోత్సవం"గా జరుపుకుంటుంది. ప్రభుత్వ రంగంలో నైతికత, సమర్థత, పారదర్శకత, ప్రజలపట్ల బాధ్యత అనే విలువలను ఈ దినోత్సవం నొక్కిచెబుతోంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ 1978లో ఆమోదించిన కార్మిక సంబంధాలపై పబ్లిక్ సర్వీస్ కూటమి - నం.151 గుర్తింపుగా, 2002లో ఐక్య రాజ్య సమితి సాధారణ సభ ఏ/ఆర్ఈఎస్/57/277 (ూా/=జుూ/57/277) తీర్మానం ద్వారా జూన్ 23ను అధికారికంగా ప్రజా సేవా దినంగా గుర్తించింది. ఆ మేరకు 2003 నుండి ఈ దినోత్సవం అంతర్జాతీయంగా జరుపుకుంటున్నారు.**




ప్రపంచవ్యాప్తంగా ప్రజల మేలు కోసం ప్రభుత్వ యంత్రాంగాలు చేసే సేవలకు గౌరవం చెల్లించేందుకు, సేవా విధులలో నిబద్ధతతో పనిచేసే అధికారులను సత్కరించేందుకు ఐక్య రాజ్య సమితి ప్రతీ సంవత్సరం జూన్ 23వ తేదీని "ప్రజా సేవా దినోత్సవం"గా జరుపుకుంటుంది. ప్రభుత్వ రంగంలో నైతికత, సమర్థత, పారదర్శకత, ప్రజలపట్ల బాధ్యత అనే విలువలను ఈ దినోత్సవం నొక్కిచెబుతోంది. ఈ దినోత్సవానికి చరిత్రాత్మక ప్రాముఖ్యత ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ 1978లో ఆమోదించిన "కార్మిక సంబంధాలపై పబ్లిక్ సర్వీస్ కూటమి-నం.151"ను గుర్తుగా, 2002లో ఐక్య రాజ్య సమితి సాధారణ సభ ూా/=జుూ/57/277 తీర్మానం ద్వారా జూన్ 23ను అధికారికంగా ప్రజా సేవా దినంగా గుర్తించింది. 2003 నుండి ఈ దినోత్సవం అంతర్జాతీయంగా జరుపు కుంటున్నారు.

ఈ దినోత్సవం నాలుగు ముఖ్యమైన లక్ష్యాల చుట్టూ నడుస్తుంది- ప్రజా సేవకుల కృషిని గౌరవించడం, యువతను సేవామార్గం లోకి ప్రేరేపించడం, ప్రజా పరిపాలనను మెరుగు పరచడం, ఉత్తమ పాలనా పద్ధతులను పంచుకోవడం. ప్రజా పరిపాలనలో కొత్త ఆవిష్కరణలకు మార్గం వేసే ఈ దినోత్సవం ద్వారా ప్రభుత్వ సేవల ప్రాముఖ్యతను ప్రపంచం అంతటా గుర్తించి, వాటిని బలోపేతం చేయడమే లక్ష్యం.

ప్రతి సంవత్సరం ఐక్య రాజ్య సమితి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న వినూత్న సేవల కోసం "ప్రజా సేవా అవార్డులు" ప్రదానం చేస్తుంది. పాలనలో ప్రజల భాగస్వామ్యం, డిజిటల్ సేవల వినియోగం, లింగ సమానత్వం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో విశిష్టత చూపిన ప్రభుత్వ సంస్థలకు ఈ అవార్డులు లభిస్తాయి. అవార్డులు కేవలం గౌరవం మాత్రమే కాదు - ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచే విధానాలకు గుర్తింపు కూడా.

భారతదేశంలో ప్రజా సేవలకు అనేక అభినవ నమూనాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది పంజాబ్ రాష్ట్రం మోహాలీ జిల్లాలో ప్రారంభించిన "సేవా కేంద్రాలు". ఈ కేంద్రాల్లో పౌరులకు అవసరమైన సేవలు - పుట్టిన సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ, విద్యుత్ బిల్లులు, ప్రభుత్వ పథకాల దరఖాస్తు మొదలైనవి ఒకే చోట, సమర్థవంతంగా అందుతున్నాయి. ఈ మోడల్‌కు ఐక్య రాజ్య సమితి 2015లో ప్రజా సేవా అవార్డు ప్రదానం చేయడం గర్వకారణం. ఇదే విధంగా ఆంధ్రప్రదేశ్ వాలంటీర్ వ్యవస్థ, కర్ణాటక భూమి పత్రాల డిజిటలైజేషన్, కేరళలో అత్యవసర సేవల నిర్వహణ వంటి కార్యక్రమాలు ప్రజా సేవలో నూతన దిశలు చూపిస్తున్నాయి. ప్రజా సేవ అనేది కేవలం ప్రభుత్వ ఉద్యోగి విధిని నిర్వహించడమే కాదు. అది ప్రజల పట్ల ఉన్న బాధ్యతను, నమ్మకాన్ని నిలబెట్టే ధర్మం. ప్రభుత్వ ఉద్యోగి నైతికతతో, సమర్థతతో పనిచేస్తేనే పాలనా వ్యవస్థ పటిష్ఠంగా నిలబడుతుంది. అందుకే ఈ దినోత్సవం ప్రతి ప్రభుత్వ సేవకునికి గుర్తు చేస్తోంది - "మీ సేవే ప్రజాస్వామ్య ప్రాణాధారం."

ఈ రోజు సందర్భంగా, ప్రభుత్వాలు తమ ప్రజా సేవ విధానాలను సమీక్షించుకోవాలి. పాలకుల నిబద్ధత, ప్రజల పట్ల జవాబుదారీతనం, సేవల సరళత వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. యువతలో ప్రజా సేవా స్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

జూన్ 23- ఐక్య రాజ్య సమితి ప్రజా సేవా దినోత్సవం - ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వ వ్యవస్థలు, అధికారులు కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. సేవే లక్ష్యంగా, నైతికతే ఆధారంగా పనిచేసే వారు ఈ ప్రపంచాన్ని మెరుగైన స్థలంగా మార్చగలరు. అవే నిజమైన ప్రజా సేవకులు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

చురకలు





# తగ్గుతున్న బంగారం

**హైదరాబాద్, జూన్ 22 :** అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో బంగారం ధరలు హెచ్చు తగ్గులకు లోనవుతున్నాయి. క్రూడాయిల్ ధరలు తగ్గడం, అమెరికా డాలర్ బలపడటం వంటి కారణాలతో పసిడి ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది కొంత ఉపశమనంగా మారింది. తాజా గుడ్ రిటర్న్స్ సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం 6 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,46,070గా నమోదైంది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర సుమారు రూ.1,33,890గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో మాత్రం 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,220గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,34,040గా ఉంది. తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ వంటి ప్రధాన పట్టణాల్లో కూడా బంగారం ధరలు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కడప, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ నగరాల్లో కూడా దాదాపు సమాన ధరలు నమోదయ్యాయి. కాకినాడలో మాత్రం స్వల్పంగా పెరుగుదల కనిపించింది.దేశవ్యాప్తంగా చూస్తే చెన్నైలో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే కొంత ఎక్కువగా ఉన్నాయి. ముంబై, కోల్‌కతా, బెంగళూరు వంటి నగరాల్లో ధరలు సుమారు ఒకే స్థాయిలో కొనసాగుతున్నాయి. మొత్తం మీద అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో బంగారం ధరల్లో స్థిరత లేకుండా మార్పులు కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుత తగ్గుదల వినియోగదారులకు కొంత ఊరటనిచ్చే అంశంగా కనిపిస్తోంది.

### 'జాకబ్ అండ్ కో' గ్లోబల్ అంబాసిడర్‌గా

# నోరా ఫతేహి ఎంపిక


**అంతర్జాతీయ వేదికపై నోరా ఫతేహి మరో మైలురాయి**

**న్యూఢిల్లీ, జూన్ 22 :** న్యూఢిల్లీ, జూన్ 22 : బాలీవుడ్ ప్రముఖ నటి, నర్తకి నోరా ఫతేహి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత లగ్జరీ వాచ్‌లు, ఆభరణాల బ్రాండ్ అయిన జాకబ్ అండ్ కో గ్లోబల్ అంబాసిడర్‌గా ఆమె ఎంపికయ్యారు. దీంతో అంతర్జాతీయ ఫ్యాషన్, లగ్జరీ రంగాల్లో భారతీయ ప్రతినిధిగా నోరా మరో కీలక మైలురాయిని అధిరోహించారు. ఈ సందర్భంగా బ్రాండ్ వ్యవస్థాపకుడు జాకబ్ అరబో నోరా ఫతేహిని ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు సుమారు రూ.35 లక్షల విలువైన లగ్జరీ వాచ్‌ను బహుమతిగా అందజేసినట్లు సమాచారం. ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రముఖ సెలబ్రిటీలకే లభించే ఈ అవకాశం నోరా ఖాతాలో చేరడం విశేషంగా మారింది. ఇప్పటికే అంతర్జాతీయ వేదికలపై తన ప్రతిభను చాటుకున్న నోరా ఫతేహి, ఖీ×ఖీూ ఔశీతీశ్రీ్స జబజూ ప్రారంభోత్సవ వేడుకల్లో చేసిన నృత్య ప్రదర్శనతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆ ప్రదర్శన అనంతరం ఆమెకు గ్లోబల్ స్థాయిలో అభిమానుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కెనడాలో జన్మించిన నోరా, పరిమిత అవకాశాలు మరియు ఆర్థిక ఇబ్బందుల మధ్య ముంబై చేరుకుని సినీ రంగంలో అడుగుపెట్టారు. ప్రారంభ దశలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ, తన నృత్య నైపుణ్యం, వేదికపై ఆకట్టుకునే ప్రదర్శనలతో బాలీవుడ్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. పలు హిట్ ఐటమ్ సాంగ్స్, మ్యూజిక్ వీడియోలు, సినిమాల ద్వారా ప్రేక్షకాదరణ పొందిన ఆమె ప్రస్తుతం అంతర్జాతీయ బ్రాండ్‌లకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగారు. వినోద రంగంలో కష్టపడి ఎదగాలనుకునే యువతకు నోరా ఫతేహి ప్రయాణం స్ఫూర్తిదాయకమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక స్థాయి నుంచి అంతర్జాతీయ గుర్తింపు వరకు ఆమె సాధించిన ప్రస్థానం ప్రతిభ, పట్టుదల, నిరంతర కృషికి నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొంటున్నారు.




# హర్మూజ్ జలసంధి మూసివేతతో ప్రపంచ చమురు మార్కెట్లు కుదేలు

**హైదరాబాద్, జూన్ 22 :** అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రపంచ చమురు మార్కెట్లు ఒక్కసారిగా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. సోమవారం ఆసియా మార్కెట్లు ప్రారంభమైన వెంటనే ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. ప్రపంచ బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ధర సుమారు 1.24 శాతం పెరిగి బ్యారెల్‌కు 81.04 డాలర్లకు చేరింది. గరిష్ఠంగా 82.30 డాలర్ల వరకు నమోదు కావడం గమనార్హం. మరోవైపు అమెరికా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర కూడా 2.53 శాతం పెరిగి 77.77 డాలర్ల వద్ద కొనసాగుతోంది. పశ్చిమాసియాలో శాంతి కోసం స్విట్జర్లాండ్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న దౌత్య చర్చల సమయంలోనే ఈ పరిణామం చోటు చేసుకోవడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది. చర్చలకు ఇది పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఇరాన్ సైనిక విభాగమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అమెరికా మద్దతుతో జరుగుతున్న చర్యలను కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనగా పేర్కొంది. ఈ పరిణామంతో షిప్పింగ్ రంగంపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. సాధారణంగా హర్మూజ్ జలసంధి మీదుగా భారీగా చమురు రవాణా జరుగుతుంది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ఇక్కడి నుంచే జరుగుతుండటంతో, ఈ మార్గం మూసివేత గ్లోబల్ ఎనర్జీ సప్లై చైన్‌కు పెద్ద ప్రమాదంగా మారింది. శనివారం 26 వాణిజ్య నౌకలు ఈ మార్గం ద్వారా ప్రయాణించగా, ఆదివారం నాటికి ఆ సంఖ్య కేవలం ఐదుకు



పడిపోయినట్లు అంతర్జాతీయ రవాణా గణాంకాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో ఎల్ఎన్‌జీ గ్యాస్ ఎగుమతులు కూడా ప్రభావితమయ్యే అవకాశాలు ఉన్నాయి. దౌత్య చర్చల సమయంలో ఉద్రిక్తతలు మరింత పెరగడం పరిస్థితిని సంక్లిష్టం చేస్తోంది. ఒకవైపు అమెరికా కఠిన చర్యల హెచ్చరికలు, మరోవైపు ఇరాన్ ప్రతిస్పందనతో ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే రోజుల్లో చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లపై ఈ పరిణామాల ప్రభావం ఎలా ఉంటుందన్నదానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

# గ్యాస్ ఉత్పత్తే భవిష్యత్ దిశగా ఓఎన్‌జీసీ

**న్యూఢిల్లీ, జూన్ 22 :** ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) వ్యాపార స్వరూపంలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయని సంస్థ చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ తెలిపారు. ఇప్పటి వరకు ముడి చమురు ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషించిన ఓఎన్‌జీసీ, ఇకపై గ్యాస్ ఉత్పత్తిని ప్రధాన ఆధారంగా మార్చుకుంటోందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఓఎన్‌జీసీని చమురు-గ్యాస్ కంపెనీగా కాకుండా గ్యాస్-చమురు కంపెనీగా చూడాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో సహజ వాయువుకు పెరుగుతున్న డిమాండ్, ధరల సంస్కరణలు, కొత్తగా అందుబాటులోకి వస్తున్న గ్యాస్ క్షేత్రాలు ఈ మార్పుకు ప్రధాన కారణాలని ఆయన తెలిపారు. కొత్త చమురు నిక్షేపాలు కనుగొనబడకపోతే చమురు ఉత్పత్తి వృద్ధి పరిమితంగానే ఉంటుందని అరుణ్ కుమార్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే గుర్తించిన కొన్ని గ్యాస్ క్షేత్రాల్లో 2027--28 ఆర్థిక సంవత్సరం నుంచి ఉత్పత్తి ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. సముద్ర గర్భ అన్వేషణలు, ఉత్పత్తి కార్యకలాపాల కోసం సంస్థ దాదాపు 33 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టుతోందని తెలిపారు. ఇక చమురు దిగుమతుల విషయానికి వస్తే, భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులను గణనీయంగా పెంచింది. మే నెలలో రోజుకు సగటున 19.1 లక్షల బ్యారళ్లుగా ఉన్న దిగుమతులు, జూన్ 19 నాటికి 26.6 లక్షల బ్యారళ్లకు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదే సమయంలో యూఏఈ నుంచి దిగుమతులు స్వల్పంగా తగ్గగా, సౌదీ అరేబియా, వెనెజువెలా నుంచి స్థిరంగా కొనసాగుతున్నాయి. అమెరికా నుంచి దిగుమతులు మాత్రం గణనీయంగా తగ్గినట్లు సమాచారం. ఈ వివరాలు షిప్ ట్రాకింగ్ సంస్థ కెప్లర్ వెల్లడించినట్లు తెలుస్తోంది. దేశ ఇంధన అవసరాల్లో మారుతున్న పరిస్థితులు, సరఫరా మార్గాల్లో జరుగుతున్న మార్పులు భారత చమురు రంగంలో కొత్త సమీకరణాలను సూచిస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు.






# జీఎంలో భారీ ఉద్యోగ కోత

**రోబోలతో కొత్త వివాదం**

**డెట్రాయిట్, జూన్ 22 :** అమెరికా ఆటోమొబైల్ దిగ్గజం జనరల్ మోటార్స్ (జీఎం) తీసుకున్న నిర్ణయం తీవ్ర చర్చకు దారి తీసింది. డెట్రాయిట్‌లోని తమ ప్రధాన అసెంబ్లీ ప్లాంట్‌లో వెయ్యికి పైగా ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో 50 కొత్త రోబోలను ప్రవేశపెట్టింది. మిచిగాన్‌లోని 'ఫ్యాక్టరీ జీరో' ప్లాంట్‌లో ఈ ఆధునిక 'కోబోట్‌లు' (కోలాబరేటివ్ రోబోలు)ను వినియోగంలోకి తీసుకొచ్చారు. ఇవి మానవ కార్మికులతో కలిసి పనిచేస్తూ వాహనాల అసెంబ్లీ పనుల్లో సహకరిస్తాయని కంపెనీ పేర్కొంది. కంపెనీ ప్రకారం, పోటీ సామర్థ్యం పెంచడం, ఉత్పత్తి నాణ్యత మెరుగుపరచడం, అలాగే భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణం. అయితే, ఈ చర్యపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. యునైటెడ్ ఆటో వర్కర్స్ యూనియన్ ఈ నిర్ణయాన్ని ఉద్యోగాల కోతగా అభివర్ణించింది. వేలాది మంది ఉపాధిని రోబోలు భర్తీ చేయడం ఆందోళన కలిగిస్తోందని కార్మిక నేతలు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, కంపెనీ ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ ఈ కోతలు జరగడం చర్చనీయాంశమైంది. ఇటీవల త్రైమాసికంలో భారీ లాభాలు నమోదు చేసినప్పటికీ, ఆటోమేషన్ పేరుతో ఉద్యోగాలు తగ్గించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు సాంకేతిక అభివృద్ధి, మరోవైపు ఉపాధి భద్రత మధ్య జరుగుతున్న ఈ ఘర్షణ ఆటోమొబైల్ పరిశ్రమలో కొత్త చర్చను ప్రారంభించింది.

# రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎలక్ట్రిక్ బైక్ డెలివరీలు ప్రారంభం

**బెంగళూరు, జూన్ 22 :** ద్విచక్ర వాహన ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ తొలి ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ 'ఫ్లయింగ్ ఫ్లీ జ6' డెలివరీలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో అధికారికంగా విడుదలైన ఈ మోడల్‌ను ప్రస్తుతం తొలి దశలో బెంగళూరులో వినియోగదారులకు అందజేస్తున్నారు. ఈ బైక్ ఎక్స్-షోరూమ్ ధర రూ. 2.79 లక్షలుగా నిర్ణయించగా, బ్యాటరీ-ఏజ్-ఏ-సర్వీస్ విధానంలో కొనుగోలు చేస్తే ప్రారంభ ధర రూ. 1.99 లక్షలుగా ఉంటుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎలక్ట్రిక్ విభాగం 'ఫ్లయింగ్ ఫ్లీ' బ్రాండ్ కింద తీసుకొచ్చిన తొలి మోడల్ ఇదే కావడం విశేషం. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఉన్న క్లాసిక్ 'ఫ్లయింగ్ ఫ్లీ' బైక్ స్ఫూర్తితో ఆధునిక ఎలక్ట్రిక్ టెక్నాలజీని కలిపి ఈ మోడల్‌ను రూపొందించారు. తేలికపాటి అల్యూమినియం ఫ్రేమ్, నియో-రెట్రో డిజైన్ దీని ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ బైక్‌లో 3.91 కిలోవాట్-గంటల లిథియం-అయాన్ బ్యాటరీని అమర్చారు. ఇది 15.4 కిలోవాట్ల శక్తి ఉత్పత్తి చేసే మోటార్‌తో పనిచేస్తుంది. గరిష్ఠ వేగం గంటకు 115 కిలోమీటర్లు కాగా, ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే సుమారు 154 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ ప్రకటించింది. 0 నుంచి 60 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 3.7 సెకన్లలో అందుకుంటుంది. చార్జింగ్ పరంగా కూడా ఇది వేగవంతమైన సదుపాయాన్ని అందిస్తోంది. 0 నుంచి 100 శాతం వరకు చార్జ్ కావడానికి సుమారు 2 గంటల 16 నిమిషాలు పడుతుండగా, 20 నుంచి 80 శాతం వరకు కేవలం 65 నిమిషాల్లో చార్జ్ అవుతుంది. ఇంటి విద్యుత్ కనెక్షన్‌తోనే సులభంగా చార్జింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఆధునిక ఫీచర్ల విషయానికి వస్తే, 3.5 అంగుళాల టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ, నావిగేషన్, కీలెస్ ఆపరేషన్, వైర్‌లెస్ చార్జింగ్, బ్లూటూత్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి. అలాగే రీజెనరేటివ్ బ్రేకింగ్, రైడింగ్ మోడ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్ వంటి భద్రతా ఫీచర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. కేవలం 124 కిలోల బరువుతో రాయల్ ఎన్‌ఫీల్డ్ చరిత్రలోనే అత్యంత తేలికైన మోడల్‌గా ఇది నిలిచింది. నగర ప్రయాణాలకు అనువుగా దీనిని ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. పెట్రోల్ బైక్‌లకు ప్రసిద్ధి చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్, ఇప్పుడు ఎలక్ట్రిక్ విభాగంలోకి ప్రవేశించడంతో ఆటోమొబైల్ మార్కెట్‌లో కొత్త పోటీ ప్రారంభమైంది.





# విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌పై స్పష్టత

**న్యూఢిల్లీ, జూన్ 22 :** భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌పై వస్తున్న రీఎంట్రీ ఊహాగానాలకు పూర్తి తెరదించాడు. టెస్ట్ ఫార్మాట్‌లో తిరిగి ఆడే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశాడు. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీని టెస్ట్ క్రికెట్‌కు మళ్లీ వచ్చే ఆలోచన ఉందా అని ప్రశ్నించగా, తాను ఆ ఫార్మాట్‌కు పూర్తిగా వీడ్కోలు పలికానని, ఇక తిరిగి రానని తేల్చి చెప్పాడు. ఇది గతమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఐపీఎల్ సందర్భంగా గాయపడిన కోహ్లీ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ గాయం కారణంగా ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు కూడా ఆయన దూరమయ్యాడు. త్వరలో బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ టెస్ట్‌కు హాజరుకానున్నట్లు సమాచారం.

### టెస్ట్ కెరీర్ విశేషాలు

కోహ్లీ తన 14 ఏళ్ల టెస్ట్ కెరీర్‌లో 123 మ్యాచ్‌లు ఆడి 9,230 పరుగులు సాధించాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యధిక స్కోర్ 254 నాటౌట్. భారత టెస్ట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆయన నాలుగో స్థానంలో నిలిచాడు.టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత కూడా కోహ్లీ వన్డేలు, టీ20ల్లో కొనసాగుతున్నాడు.





# అన్విత ఖమ్మం ఏసెస్‌కు ఘన ఆరంభం

**ఖమ్మం, జూన్ 22 :** ప్రతిష్టాత్మక టీజీ20 టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో అన్విత ఖమ్మం ఏసెస్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయాన్ని అందుకుంది. పాలమూరు స్ట్రైకర్స్‌పై 20 పరుగుల తేడాతో గెలిచి టోర్నీలో శుభారంభం చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు భారీ స్కోరును నమోదు చేసింది. వాఫి కచ్చి (60), సాయికృష్ణ (52) అర్ధ సెంచరీలతో చెలరేగగా, హిమతేజ (59 నాటౌట్) చివరి వరకు నిలబడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ ముగ్గురు బ్యాటర్ల ధాటికి జట్టు నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లకు 237 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో పాలమూరు స్ట్రైకర్స్ గట్టి పోరాటం చేసినప్పటికీ విజయాన్ని అందుకోలేకపోయింది. ఓపెనర్ విఘ్నేశ్ (86) అద్భుత ఇన్నింగ్స్ ఆడినా, ఇతర బ్యాటర్ల నుంచి సహకారం లేకపోవడం జట్టుకు పెద్ద లోటుగా మారింది. ఖమ్మం బౌలర్లు కీలక సమయంలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి వికెట్లు తీయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. చివరికి పాలమూరు జట్టు 6 వికెట్లకు 217 పరుగులు మాత్రమే చేయగలిగింది.

# పావెల్ సిక్సర్ల సునామీతో ఎల్ఏ నైట్ రైడర్స్ ఘన విజయం

**లాస్ ఏంజెలెస్, జూన్ 22:** అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) టోర్నమెంట్‌లో లాస్ ఏంజెలెస్ నైట్ రైడర్స్ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసింది. సియాటిల్ ఓర్కాస్‌పై 81 పరుగుల తేడాతో గెలిచి అభిమానులను ఉర్రూతలూగించింది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ పవర్ హిట్టర్ రోవ్‌మన్ పావెల్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిపోయాడు. కేవలం 11 బంతుల్లోనే 37 పరుగులు చేసి జట్టు స్కోరును ఆకాశానికెత్తాడు. మ్యాచ్‌లో కీలక ఘట్టంగా 17వ ఓవర్ నిలిచింది. శ్రీలంక ఆల్‌రౌండర్ దసున్ శనక వేసిన ఆ ఓవర్‌లో పావెల్ వరుసగా ఐదు సిక్సర్లు బాదాడు. ఆ ఒక్క ఓవర్‌లోనే 30 పరుగులు వచ్చాయి. పావెల్ దూకుడుతో లాస్ ఏంజెలెస్ నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 196 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన సియాటిల్ ఓర్కాస్ జట్టు 115 పరుగులకే కుప్పకూలింది. బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో నైట్ రైడర్స్ సులభంగా విజయం సాధించి టోర్నీలో తమ స్థితిని బలోపేతం చేసుకుంది.




# ఈజిప్ట్‌కు చరిత్రాత్మక విజయం

**న్యూయార్క్, జూన్ 22:** ఫిఫా వరల్డ్ కప్‌లో ఈజిప్ట్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 3-1 గోల్స్ తేడాతో గెలిచి అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. మ్యాచ్ ప్రారంభంలో ఆధిక్యం న్యూజిలాండ్‌కే దక్కింది. 15వ నిమిషంలో ఫిన్ సుర్మన్ గోల్ చేసి జట్టుకు లీడ్ అందించాడు. కానీ రెండో అర్ధభాగంలో ఈజిప్ట్ ఆటగాళ్లు అద్భుతంగా పుంజుకున్నారు. కేవలం 24 నిమిషాల వ్యవధిలో మూడు గోల్స్ చేసి మ్యాచ్‌ను పూర్తిగా తమ వైపు తిప్పుకున్నారు. ఈ విజయంతో ఈజిప్ట్ గ్రూప్ జీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఈజిప్ట్ స్టార్ ప్లేయర్ మొహమ్మద్ సలాహ్ ఈ మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించాడు. ఒక గోల్ చేయడంతో పాటు మరో గోల్‌కు అసిస్ట్ అందించి జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ఈజిప్ట్ నాలుగోసారి వరల్డ్ కప్‌లో పాల్గొంటుండగా, 1934 తర్వాత తొలిసారి ఈ స్థాయిలో విజయం నమోదు చేయడం విశేషంగా మారింది. తదుపరి మ్యాచ్‌లో ఇరాన్‌తో గెలిస్తే నాకౌట్ దశకు చేరే అవకాశం ఉంది.



# ఘలేనోయి ప్రశంసలు.. ఈజిప్ట్ మ్యాచ్‌పై దృష్టి



**సోఫీ స్టేడియం, జూన్ 22 :** ఫిఫా ప్రపంచ కప్ 2026 గ్రూప్ జీ మ్యాచ్‌లో బెల్జియంతో గోల్ రహిత డ్రా సాధించిన తర్వాత ఇరాన్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్ అమీర్ ఘలేనోయి తన జట్టు ప్రదర్శనను ప్రశంసించారు. బెల్జియం వంటి శక్తివంతమైన జట్టుపై విలువైన పాయింట్ సాధించడం సంతృప్తికరమని ఆయన తెలిపారు. అదే సమయంలో ఈజిప్ట్‌తో జరిగే చివరి గ్రూప్ మ్యాచ్ ముందు ఆటగాళ్ల శారీరకంగా కోలుకోవడం పెద్ద సవాలుగా మారిందని చెప్పారు. ఈ మ్యాచ్‌లో గోల్ కీపర్ అలీరెజా బీరన్‌వంద్ అద్భుత ప్రదర్శనతో బెల్జియం దాడులను అడ్డుకున్నాడు. అనేక కీలక సేవ్‌లతో అతను మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించాడు. ఇరాన్ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో 2-2 డ్రా చేసుకుని, ఇప్పుడు రెండు మ్యాచ్‌ల నుంచి రెండు విలువైన పాయింట్లు సాధించింది. ఈ ఫలితాలతో గ్రూప్ జీ పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతూ నాకౌట్ దశకు చేరే అవకాశాలను బలపరుచుకుంది. మ్యాచ్ అనంతరం ఘలేనోయి మాట్లాడుతూ, గత ఆరు నెలలుగా తమ జట్టు ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను ప్రస్తావించారు. ప్రయాణ సమస్యలు, సన్నాహక లోపాలు ఉన్నప్పటికీ ఆటగాళ్లు చూపిన పట్టుదల గొప్పదని ఆయన అన్నారు. ఇప్పుడు అందరి దృష్టి శనివారం జరిగే ఈజిప్ట్‌తో కీలక పోరుపై నిలిచింది. ఆ మ్యాచ్ ఫలితమే ఇరాన్ భవితవ్యాన్ని నిర్ణయించనుంది.

# ముంబై ఇండియన్స్‌లో భారీ మార్పుల చర్చ

**ముంబై, జూన్ 22 :** ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన ముంబై ఇండియన్స్ జట్టులో భారీ మార్పులు జరగనున్నాయనే ఊహాగానాలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. జట్టు కెప్టెన్‌గా ఉన్న స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టును వీడే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. అతని నాయకత్వంలో జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేక పోవడం, డ్రెస్సింగ్ రూమ్‌లో అసంతృప్తి పెరగడం వంటి కారణాలు ఈ నిర్ణయానికి దారి తీసినట్లు చెబుతున్నారు. అతని స్థానంలో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ను ట్రేడ్ ద్వారా తీసుకురావాలని ముంబై యాజమాన్యం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాజస్థాన్ జట్టులో ఇటీవల అతని పాత్రపై అనిశ్చితి ఉండటంతో ఈ మార్పు చర్చకు వచ్చింది. అదే సమయంలో స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ కూడా ముంబై ఇండియన్స్‌ను వీడే ఆలోచనలో ఉన్నాడని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొత్త జట్ల నుంచి అతనికి కెప్టెన్సీ ఆఫర్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య ముంబై ఇండియన్స్ జట్టు భవిష్యత్ ప్రణాళికలు ఆసక్తికరంగా మారాయి. సీనియర్ ఆటగాళ్ల స్థానంలో కొత్త తరం స్టార్ ప్లేయర్లతో జట్టును పునర్నిర్మించాలనే ఆలోచనలో ఫ్రాంచైజీ ఉన్నట్లు సమాచారం.





# మహిళా క్రికెటర్లకు తీపికబురు

**'అమ్మ'గా ఆటలో రాణించేందుకు అండగా ఐసీసీ!**



మహిళా క్రికెటర్లకు మరింత భరోసా కల్పించే దిశగా అంతర్జాతీయ క్రికెట్ మండలి మరో ముందడుగు వేసింది. మాతృత్వ దశలో మహిళా క్రికెటర్లకు ఆర్థికంగా, వైద్య పరంగా సాయం అందించేందుకు ఐసీసీ సిద్ధమవుతోంది. బిడ్డను కన్న తర్వాత అమ్మగా.. మళ్లీ క్రికెట్ ఆడే వారికోసం కొన్ని మార్గదర్శకాలు రూపొందించింది అత్యున్నత క్రికెట్ మండలి. మహిళా ప్లేయర్లు పిల్లలకు జన్మనివ్వడం నుంచి.. మళ్లీ మైదానంలోకి దిగేంత వరకూ వారికి పెద్దన్నలా అన్ని విధాలా సాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఐసీసీ వెల్లడించింది. ఐసీస ఈవెంట్లో పురుష క్రికెటర్లతో సమానంగా మహిళా క్రికెటర్లకు వేతనాలు చెల్లిస్తున్న ఐసీసీ.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. తల్లైన తర్వాత మళ్లీ క్రికెట్ ఆడాలనుకునే మహిళా ప్లేయర్లకు అడుగడుగునా భరోసాగా నిలువనుంది. గర్భం దాల్చిన అనంతరం, ఆపై ప్రసవం అనంతరం శారీరక, మానసిక మార్పులకు లోనయ్యే మహిళా క్రికెటర్లకు అనుకూలమైన వాతావరణంలో శిక్షణ ఇవ్వాలని ఐసీసీ భావిస్తోంది. అలానే.. వారి పిల్లలను చూసుకోవడం, గర్భిణిలకు రవాణా, మెడిసిన్ ఖర్చులు భరించడం వంటివి చూసుకోనుంది. చాలామంది క్రికెటర్లు కెరీర్ సమయంలోనే వైవాహిక జీవితం వైపు మొగ్గు చూపిస్తున్న నేపథ్యంలో ఐసీసీ ఈ నిర్ణయాలను అనుసరించాలనుకుంటోంది. ఆస్ట్రేలియా మహిళల జట్టు డాక్టర్ ఫిలిప్పా ఇంగే నేతృత్వంలోని ఐసీసీ వైద్య సలహా కమిటీ సూచనల మేరకు ఈ కార్యాచరణను రూపొందించారు.



# 2027 వరల్డ్‌కప్‌పై బీసీసీఐ రోడ్‌మ్యాప్

**న్యూఢిల్లీ, జూన్ 22:** 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌లో ఎదురైన పరాజయం తర్వాత 2027 మెగా టోర్నీని లక్ష్యంగా పెట్టుకుని భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బోర్డు ఇప్పటికే కొత్త రోడ్‌మ్యాప్‌ను రూపొందిస్తూ, సెలెక్టర్లు, కోచింగ్ స్టాఫ్ మధ్య పూర్తి సమన్వయంతో జట్టు నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు వెల్లడించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆటగాళ్ల ఎంపిక, కాంబినేషన్లు, వ్యూహాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌ను ఈ ప్రణాళికలో కీలక పరీక్షగా భావిస్తున్నారు. ఈ సిరీస్ ద్వారా కొత్త ఆటగాళ్ల ప్రదర్శనను అంచనా వేసి, 2027 వరల్డ్‌కప్‌కు బలమైన జట్టును తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత జట్టు ఎంపిక కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కలిసి జట్టు కూర్పుపై సన్నిహితంగా పనిచేస్తున్నారని సమాచారం. కొత్త వన్డే కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ బాధ్యతలు చేపట్టడంతో, అతని నాయకత్వంలో జట్టు కొత్త దశలోకి అడుగుపెట్టింది. ఇప్పటికే ఆఫ్ఘనిస్థాన్‌పై క్లీన్‌స్వీప్ సాధించిన భారత్, ఇంగ్లాండ్ సిరీస్‌తో తన బలాన్ని మరింత పరీక్షించుకోనుంది. బీసీసీఐ లక్ష్యం కేవలం తాత్కాలిక విజయాలు కాకుండా, 2027 వరల్డ్‌కప్‌ను గెలిచే స్థాయి బలమైన జట్టును నిర్మించడం అని స్పష్టం చేసింది.



చురకలు



# ప్రేక్షకుల దృక్కోణం మారింది

## అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నా: సాయిదుర్గా తేజ్

సాయి దుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్.కె.పి దర్శకత్వంలో రానుంది. ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. తాజాగా ఈ ఆలస్యంపై సాయి దుర్గా తేజ్ స్పందించారు. సినిమాల ఎంపికలో తాను ఎందుకు ఇంత సమయం అవసరమవుతోందో వివరించారు. ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల్లో ఎన్నో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని జానర్‌లలోని కంటెంట్ గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు వచ్చిందని అందుకే తన సినిమాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లను మెప్పించాలంటే కథల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. అందుకే కాస్త సమయం పడుతోందని స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తన సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా శ్రమిస్తున్నట్లు గతంలో సాయి దుర్గా తేజ్ తెలిపారు. దర్శకుడు రోహిత్ విజన్ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని చెప్పారు.





# చిన్న పాత్రలతో ప్రారంభమై స్టార్‌గా ఎదిగిన సాయి ధన్సిక

సినీ పరిశ్రమలో అనేక మంది నటీనటులు చిన్న చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించి, సంవత్సరాల కృషి తర్వాత ప్రధాన పాత్రల్లో స్థిరపడిన ఉదాహరణలు ఉన్నాయి. హీరోలు మాత్రమే కాకుండా హీరోయిన్లు కూడా ఇలాంటి కష్టతరమైన ప్రయాణం ద్వారా స్టార్ స్థాయికి చేరుకున్న సందర్భాలు ఎన్నో కనిపిస్తాయి. ప్రారంభంలో సైడ్ ఆర్టిస్టులు లేదా డాన్సర్లుగా పనిచేసిన వారు కూడా తర్వాత కాలంలో ప్రముఖ నటీనటులుగా ఎదిగారు. ఈ క్రమంలో త్రిష, కాజల్ అగర్వాల్ వంటి స్టార్ హీరోయిన్లు కూడా కెరీర్ ప్రారంభంలో చిన్న పాత్రల్లో నటించి, ఆ తర్వాత అగ్ర హీరోయిన్ స్థాయికి చేరుకున్నారు. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలో కనిపిస్తున్న బ్యూటీ కూడా అలాంటి ప్రయాణమే చేసిన నటి అని సమాచారం.ఆమె మరెవరో కాదు తమిళ నటి సాయి ధన్సిక. 2006లో సినీ రంగ ప్రవేశం చేసిన ఈ ముద్దుగుమ్మ ప్రారంభంలో తమిళ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలతోనే కెరీర్‌ను కొనసాగించింది. అయితే ఆరంభంలో పెద్దగా గుర్తింపు రాలేదు. అయినప్పటికీ 2016లో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'కబాలి' చిత్రంలో ఆయన కుమార్తె పాత్రలో నటించి మంచి గుర్తింపు సంపాదించింది. ఆ సినిమా ఆమె కెరీర్‌కు పెద్ద మలుపుగా మారి ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. దాదాపు పది సంవత్సరాల కష్టపడి చేసిన ప్రయాణం తర్వాత వచ్చిన ఈ విజయం సాయి ధన్సిక కెరీర్‌ను కొత్త దిశలోకి తీసుకెళ్లిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా కొనసాగుతోంది.





# బాలకృష్ణ-కొరటాల కాంబో

## 25న షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం

బాలకృష్ణ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బికె 112'గా ప్రచారంలో ఉంది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. తాజాగా ఆ వివరాలను చిత్రబృందం పంచుకుంది. జూన్ 25న వెంకటపాలెంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుంది. ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ హాజరు కానున్నారు. మే నెలలో ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది' అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలయ్య.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. కాజల్ కథానాయికగా నటిస్తుండగా.. మంచు మనోజ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఈ రెండు సినిమాలను బాలకృష్ణ ఒకేసారి పూర్తి చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

## నాంపల్లి కోర్టుకు హాజరుకాని అల్లు అర్జున్.. విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు



**హైదరాబాద్, జూన్ 22:** హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సంధ్య థియేటర్ కేసులో నాంపల్లి కోర్టుకు సినీనటుడు అల్లు అర్జున్ హాజరు కాలేదు. షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఇవాళ కోర్టుకు హాజరుకావాలని 19 మంది నిందితులకు ఇటీవల నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, అల్లు అర్జున్ మినహా మిగతా నిందితులంతా న్యాయమూర్తి ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం కేసు విచారణను న్యాయమూర్తి కేసు విచారణను జులై 6కి వాయిదా వేశారు. అనంతరం ఈ కేసు విచారణను జులై 6వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

# పవన్‌తో దర్శకుడు మెహర్ రమేశ్ భేటీ

## కూతరు పెళ్లికి రావాలంటూ ఆహ్వానం

దర్శకుడు మెహర్ రమేశ్.. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిశారు. త్వరలో జరగనున్న తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ ఫొటోలను ఎక్స్ వేదికగా పంచుకున్న దర్శకుడు.. ఎన్నేళ్లయినా పవన్‌తో తన బంధం శాశ్వతమని పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితం విజయవాడలో జరిగిన నా పెళ్లికి పవన్ వచ్చి నన్ను ఆశీర్వదించారు. ఈరోజు నేను విజయవాడ వచ్చి నా కుమార్తె పెళ్లికి పవన్‌ను ఆహ్వానించాను. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. కాలం మారుతుంది.. తరాలు మారతాయి.. కానీ మా సోదర బంధం శాశ్వతం' అంటూ పంచుకున్న ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఏపీ రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా ఇటీవల ఏపీ ప్రభుత్వం మెహర్ రమేశ్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన మెహర్ రమేశ్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com